
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 24.0



ANDHRAJYOTHY
3
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
మంగళవారం 27 మే 2025



# ముందే తొలకరి..!



మేఘాలు

**జిల్లాకు రుతుపవనాల పలకరింపు**
**ఖరీఫ్ సాగుకు రైతన్న సమాయత్తం**
**అరకొరగా ఎరువుల నిల్వలు**

పుట్టపర్తి, మే 26(ఆంధ్రజ్యోతి): ఈసారి నైరుతి రుతుపవనాలు ముందస్తుగానే పలకరించాయి. తొలకరి చినుకులతో రైతులు ఖరీఫ్ సాగు సమాయత్తమవుతున్నారు. వేసవిలోనే వర్షాలు కురుస్తుండగా.. నైరుతి ముందస్తు పలకరింపుతో రైతులు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సాగు పెరగవచ్చున్న వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సాగుకు ప్రధానమైన ఎరువులు మాత్రం జిల్లాకు ఆశించినంతగా సరఫరా కాలేదు. ఖరీఫ్ లో జిల్లాకు 38 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు కావాల్సి వుండగా 19,917 మెట్రిక్ టన్నుల నిల్వలు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ శాఖ చెబుతోంది. సాగుకు తగ్గట్టుగా విత్తనం, ఎరువులు సరఫరా కాలేదు. ఇందులో ప్రధానంగా యూరియా సరఫరా లేదు. జిల్లాలో 9,362 మెట్రిక్ టన్నుల యూరియా ఉన్నట్లు వ్యవసాయశాఖ లెక్కలు చెబుతున్నా.. రైతు సేవా కేంద్రాల్లో నిల్వలు కనిపించడంలేదు. ఓవైపు విత్తన వేరుశనగ, మరోవైపు ఎరువుల కోసం రైతులు వెంపర్లాడే పరిస్థితి కనిపిస్తోంది.

### పెరగనున్న సాగు



దుక్కులు చేసుకుంటున్న రైతు

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 2.50 లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతాయని అంచనా వేస్తున్నారు. గత ఏడాది ఖరీఫ్‌లో 2.34 లక్షల హెక్టార్లు సాగు చేశారు. గత ఏడాదితో పోల్చితే సాగు పెరగనుంది. వేసవిలోనే వర్షాలు కురవడం, ఎనిమిది రోజుల ముందుగానే జిల్లాలకు నైరుతి చల్లని కబురుతోపాటు ఈసారి వర్షాలు భారీగా కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతుండడంతో రైతుల్లో సాగుపై ఆసక్తి పెరిగింది. వేరుశనగతోపాటు కంది, మొక్కజొన్న, మిర్చి, వరి, పత్తి ఇతర వాణిజ్య పంటల సాగు పేరిగే అవకాశం ఉంది. సాగు పెరిగితే విత్తనంతోపాటు ఎరువులు, మందులు వినియోగం పెరుగుతాయి. ఆ మేరకు వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలి. బదిలీల్లో వ్యవసాయ శాఖ అధికారులు మునిగిపోవడంతో విత్తనం, ఎరువులను అందుబాటులో ఉంచడంపై పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### రైతుసేవా కేంద్రాల్లో నిల్వలు అంతంతే..

జిల్లాలో 416 రైతు సేవాకేంద్రాల్లో 902 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ శాఖ చెబుతోంది. ఈ లెక్కన ఒక్కో రైతు సేవా కేంద్రంలో రెండు మెట్రిక్ టన్నుల చొప్పున ఎరువులు అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. ఏ కేంద్రంలో ఎరువులు ఉన్నాయో స్పష్టంగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. జిల్లావ్యాప్తంగా 19,917 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచామని వ్యవసాయ శాఖ చెబుతోంది. ఇందులో యూరియా 9,362, డీఏపీ 2,180, ఎంఓపీ 1093, ఎన్‌పీకెఎస్ 5,714, ఎస్ఎస్‌పీ 1537, కంపోస్ట్ 4, ఎఫ్ఓఎం 23 మెట్రిక్ టన్నుల మేర అందుబాటులో ఉన్నట్లు చెబుతోంది. కొన్ని నెలలుగా యూరియా సరఫరా కాలేదు. ఖరీఫ్ సాగుకు సగటున 38 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉండగా సగం మాత్రమే అందుబాటులో ఉంది. పంట సాగు చేసిన తరువాత యూరియాను అధికంగా వినియోగిస్తారు. అవసరమైన ఎరువులను తెప్పించాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలో ఖరీఫ్ సాగుకు అవసరమైన 20వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఇంకా అవసరమైన మేరకు తెప్పిస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు తెలిపారు.

# జిల్లాలో ఆరెంజ్ అలర్ట్



ఆరెంజ్ అలర్ట్ ప్రకటించిన జిల్లాలు

పుట్టపర్తి టౌన్, మే 26(ఆంధ్ర జ్యోతి): నైరుతి రుతుపవనాల ప్రభావంతో మంగళవారం నుంచి జూన్ 1వరకు జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మంగళ, బుధవారాల్లో జిల్లాలో 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురుస్తుందని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. జూన్ 1వరకు ఇదే వాతావరణం కొనసాగే అవకాశం ఉందన్నారు. గత ఏడాది జూన్ 2న రాష్ట్రంలో రుతుపవనాలు ప్రవేశించగా.. ఈసారి వారం ముందుగానే వచ్చాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

# ప్రజా ఫిర్యాదులకు పరిష్కారమేదీ..?



కలెక్టర్ కార్యాలయం

## తూతూమంత్రంగా అర్జీల స్వీకరణ

**భూవివాదాలు పరిష్కరించని రెవెన్యూ అధికారులు**
**కలెక్టరేట్ చుట్టూ బాధితుల ప్రదక్షిణ**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక.. అధికారుల అలసత్వంతో అభాసుపాలవుతోంది. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లోనూ దీనిని నిర్వహిస్తున్నారు. మండల స్థాయిలో అధికారులు పరిష్కరించడం లేదని పలువురు బాధితులు జిల్లా కేంద్రానికి వచ్చి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర జిల్లా అధికారుల వద్ద తమ గోడు విన్నవించుకుంటున్నారు. వీరు మళ్లీ అక్కడికే వెళ్లి మండల అధికారులను కలవమంటున్నారు.. అక్కడికెళితే మా చేతుల్లో ఏమీ లేదని తప్పించుకుంటున్నారు. ప్రజలు ఒకే అర్జీపై పదేపదే కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి ఫలితం లేకుండా పోతోంది.**

పుట్టపర్తిటౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) తూతూమంత్రంగా సాగుతోంది. ప్రభుత్వాలు మారినా, కలెక్టర్లు మారినా, జిల్లాలోని ప్రజల సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు. సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయానికి వందలాది మంది ప్రజలు వచ్చి అర్జీలిచ్చి వెళ్తున్నారే తప్ప సమస్యలు అలాగే ఉన్నాయి. జిల్లా అధికారులు కూడా ప్రతి సోమవారం మొక్కుబడిగా పీజీఆర్ఎస్‌కు వచ్చి అర్జీలు స్వీకరించడమే తప్ప, పరిష్కారం పట్ల ఆసక్తి చూపించలేదని తెలుస్తోంది. కలెక్టర్ ప్రతివారం పాల్గొని అర్జీలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఆయన ఆదేశాలు అమలు కావడంలేదు. ప్రజలు కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు ఇచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపుతారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించాల్సిన అధికారులు తూతూ మంత్రంగా అర్జీదారులను తమ వద్దకు పిలిపించుకుని, సంతకాలు చేయించుకుని సమస్య పరిష్కారమయినట్లు ఉన్నతాధికారులకు నివేదికలు పంపి చేతులు దులుపుకుంటున్నారు. చాలా మంది అర్జీదారులకు అధికారులు తమతో ఎందుకు సంతకాలు చేయించుకుంటున్నారో కూడా తెలియడంలేదు. ఉన్నతాధికారులు కూడా కిందిస్థాయి అధికారులు, సిబ్బంది చెప్పిందే నమ్ముతూ, అర్జీదారుల మాట పెడచెవిన పెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఒకే సమస్యపై పదే పదే కలెక్టర్ కార్యాలయం చుట్టు అర్జీదారులు ప్రదక్షిణలు చేస్తున్నారు. తమ సమస్యలను ఎప్పుడు పరిష్కరిస్తారో తెలియక, ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చే అర్జీదారులు చాలామంది ఉన్నారు. మండల స్థాయిలో సమస్యలు పరిష్కారం కాక జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వస్తే.. ఇక్కడ కూడా తమను పట్టించుకునేవారు లేరంటూ వాపోతున్నారు.

### నిషేధిత జాబితా నుంచి తొలగించమంటే పట్టించుకోలేదు



కదిరి మండలం సైదాపురం గ్రామం పొలం సర్వేనెంబర్ 224/1లో రెండున్నర సెంట్ల ఇంటి స్థలాన్ని 2009లో కొనుగోలు చేశాం. ఆ స్థలంలో ఇల్లు కూడా కట్టుకున్నాం. నాతో పాటు ఇదే సర్వేనెంబరులోని ఏడు ఎకరాల్లో వందలాదిమంది స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. ఈ స్థలాన్ని 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి రిజిస్ట్రేషన్ జరగకుండా చేశారు. నా సమస్యపై ఈ యేడాది జనవరిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను కలిసి అర్జీ ఇచ్చాను. కదిరి తహసీల్దార్‌ను కలవమని కలెక్టర్ చెప్పారు. తహసీల్దార్‌లను కలవగా, తన చేతిలో ఏమీలేదని, కలెక్టర్‌ను కలవమని చెప్పి చేదులు దులుపుకున్నారు. కొంతమంది చోటా నాయకులు, 22ఏ నిషేధిత జాబితా నుంచి స్థలాలను తొలగిస్తామని డబ్బులు వసూలు చేశారు. ఇటీవల కొంతమంది రెవెన్యూ అధికారులు వచ్చి ఇళ్లస్థలాల జిరాక్స్ పత్రాలను తీసుకెళ్లారు. సమస్య మాత్రం పరిష్కారం కాలేదు.

-తానా షమీమ్, కదిరి

### భూమి తీసుకున్నారు.. పరిహారం మరిచారు

కొత్తచెరువు గ్రామ రెవెన్యూ పొలంలో సర్వేనెంబర్ 1457/2లో 44 సెంట్లు ప్రభుత్వ భూమిని 2003లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నా తల్లి కుంచెపు సాలెమ్మ పేరుపై డి పట్టా ఇచ్చింది. ఈ భూమిలో మా కుటుంబం కూరగాయలు పండించుకుంటూ బతికేది. ఆరు సంవత్సరాల క్రితం ఈ భూమిని వానపాముల పెంపకం కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. మా భూమికి ప్రత్యామ్నాయంగా మరోచోట ఇస్తామని అప్పటి రెవెన్యూ అధికారులు చెప్పారు. తరువాత భూమి కోసం పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. దీంతో ఈయేడాది జనవరిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను కలిసి అర్జీ ఇచ్చాను. కొత్తచెరువు రెవెన్యూ అధికారులను కలవాలని కలెక్టర్ చెప్పారు. స్థానిక రెవెన్యూ అధికారులు మేము చేయగలిగింది ఏమీ లేదని నాతో సంతకం చేయించుకుని పంపారు. మనోవేదనతో ఇటీవల నా తండ్రి వెంకటరాములు మృతిచెందారు. కనీసం పరిహారమయినా ఇవ్వాలని కలెక్టర్‌ను కోరినా పట్టించుకోలేదు.



- కుంచెపు రాజు, కొత్తచెరువు

### రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు

మండల కేంద్రమైన సోమందేపల్లి ఎస్సీకాలనీ వాసులు రాకపోకలు సాగించే రహదారి పక్కన ఓ ప్రభుత్వ అధికారిణి భూమి కొనుగోలు చేశారు. ఎస్సీ కాలనీ వాసులు రాకపోకలు సాగించే దారిని ఆమె ఆక్రమించారు. ఏన్నో యేళ్లుగా మేము ప్రయాణిస్తున్న రహదారిని ఆమె కొనుగోలు చేసినట్లు చెబుతూ కాలనీ వాసులను వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. ఈ సమస్యపై నాలుగు నెలల క్రితం కలెక్టర్‌ను కలిసి విన్నవించా. ప్రతివారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చి అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోలేదు. సమస్య పరిష్కారం కాకుంటే ఆత్మహత్యే శరణ్యమని సోమవారం కలెక్టర్‌తో ఆవేదన తెలిపాను.

- రామాంజనేయులు, సోమందేపల్లి



కలెక్టర్‌కు మొరపెట్టుకుంటున్న రామాంజనేయులు, సోమందేపల్లి

# ప్రజాఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి: ఎస్పీ





బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ రత్న ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక నిర్వహించారు. బాధితుల నుంచి ఎస్పీ 70 ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.

సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదుదారుల నుంచి అందిన సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి సత్వరమే న్యాయం చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, లీగల్ సెల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, ఎస్పీ సీఏ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

# సౌదీలో చిక్కుకున్న ధర్మవరం యువకుడు

**స్వదేశానికి రప్పించేందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ చర్యలు**

(వివరాలు 5వ పేజీలో..)

# గందరగోళం!

**వ్యవసాయ శాఖ కౌన్సెలింగ్‌లో ఇష్టారాజ్యం**

4

**విద్యా శాఖలో 11 బృందాల ఏర్పాటు**
- బదిలీలు, ప్రమోషన్ల కోసం నియామకం

# కృష్ణదేవరాయా.. మన్నించు..

## రాయలకాలంనాటి బావికి ఆదరణ కరువు

పెనుకొండ, మే 26(ఆంధ్రజ్యోతి): విజయనగర రాజుల కాలంలో ప్రజల సౌకర్యార్థం రోడ్లపక్కన నిర్మించిన పురాతన బావులు ఆదరణ కోల్పోయి డంప్‌యార్డులుగా మారుతున్నాయి. శ్రీకృష్ణదేవరాయల రెండో రాజధాని పెనుకొండకు వచ్చే బాటసారుల సౌకర్యార్థం రోడ్లకిరువైపులా మొక్కలు నాటి, బావులు తవ్వించారు. వారు సేదతీరడానికి చత్రాలు, మండపాలు నిర్మించారు. పట్టణంలోని రహదారి పక్కన మంత్రి సవిత పెట్రోల్ బంక్ వెనుకభాగంలో రాయల కాలంలో బాటసారుల సౌకర్యార్థం నిర్మించిన పురాతన బావి ఆదరణ కోల్పోయి చెత్తాచెదారంతో నిండిపోయి, డంప్‌యార్డును తలపిస్తోంది. అపురూప సంపదపై అలవిగాని నిర్లక్ష్యం ఏంటని పట్టణవాసులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని బావి మరమ్మతులు చేపట్టి, వారసత్వ సంపదను కాపాడాలని కోరుతున్నారు.



వ్యవసాయ శాఖ బదిలీల కౌన్సెలింగ్‌లో ఇష్టారాజ్యం

ఒక్కొక్కరికి ఒక్కో న్యాయం అన్న విమర్శలు

జాబితాలో ముందున్న వారికే రిక్వెస్ట్ బదిలీలు

కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులే చెల్లుబాటు

# గందరగోళం!




కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ శ్రీధర్, హాజరైన అధికారులు, ఉద్యోగులు

అనంతపురం అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. అనంతపురం జేడీఏ కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలకు సంబంధించి ఏడీఏలు, ఏఓలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ సోమవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అదనపు సంచాలకుడు (ఏడీ) శ్రీధర్ నేతృత్వంలో ఆయా జిల్లాల జేడీఏలు ప్రక్రియలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నందాకా సీనియర్ అసిస్టెంట్లు, ఏడీఏలు, మధ్యాహ్నం నుంచి రాత్రిదాకా ఏఓలకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. నాలుగు ఉమ్మడి జిల్లాల అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో జేడీఏ కార్యాలయ ఆవరణలో సందడి నెలకొంది. ఒకేచోట ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన వారితో పాటు రిక్వెస్ట్ కింద పలువురు ఉద్యోగులు బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. ఐదేళ్లు పూర్తయిన అధికారులు, ఉద్యోగులను వారు ఇచ్చిన మూడు ఆప్షన్లలో ఒక స్థానాన్ని ఖరారు చేసినట్లు సమాచారం. రిక్వెస్ట్ కింద బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికే న్యాయం చేసినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ జాబితాలో ముందున్న కొందరికే రిక్వెస్ట్ బదిలీకి అంగీకరించారు. ఆ తర్వాత జాబితాలోని అధికారులు, ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా కౌన్సెలింగ్‌లో చెప్పుకునేందుకు కూడా అవకాశం ఇవ్వలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు కేడర్లలో ఐదేళ్లు పూర్తికాని స్థానాలకు ఇతర అధికారులను బదిలీ చేసేందుకు అంగీకరించినట్లు తెలిసింది. ఇదే తరహాలో దరఖాస్తు చేసుకున్న మరికొందరు అధికారుల దరఖాస్తులను పక్కనపెట్టినట్లు సమాచారం. కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులను ఓకే చేసి.. అక్కడికక్కడే అధికారులకు ఖరారు చేసి పంపినట్లు సమాచారం. మరికొందరి సిఫార్సులను బుట్టదాఖలు చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముందస్తు మేనేజ్ నేపథ్యంలోనే పలువురు అధికారులు వారు కోరుకున్న స్థానాలకు పంపకుండా ఆపేసినట్లు చర్చ సాగుతోంది. ఏడీఏలు, ఏఓలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు రాష్ట్రస్థాయిలో ఫైనల్ చేస్తారు. ఏడీ నేతృత్వంలోని కమిటీ సిఫార్సులనే దాదాపుగా రాష్ట్ర ఉన్నతాధికారులు ఓకే చేసే పరిస్థితి ఉంది. ఇక్కడ తమకు అన్యాయం జరిగిందని భావించిన అధికారులు, ఉద్యోగులు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులను కలిసే అవకాశం ఉన్నా.. అక్కడికి వెళ్లేవారు తక్కువేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. రిక్వెస్ట్ బదిలీల్లో అన్ని కేడర్లలో కొందరు ఉద్యోగులకు ఒక న్యాయం.. మరికొందరికి మరో విధంగా వ్యవహరించడంపై బాధిత వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వ్యవసాయ శాఖ యూనియన్లలో ఆఫీస్ బేరర్లుగా ఉన్న అధికారులు, ఉద్యోగులకు చేదు అనుభవం ఎదురైనట్లు తెలిసింది. ఆఫీస్ బేరర్లు.. కలెక్టర్ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. బదిలీల సమయానికి కలెక్టరేట్ నుంచి ప్రొసీడింగ్స్.. కమిటీకి అందకపోవడంతో తమకు ఏ స్థానం కేటాయిస్తారోనన్న సందేహాలను ఆ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.



## దరఖాస్తు చేయకపోయినా..

వ్యవసాయశాఖలో బదిలీకోసం దరఖాస్తు చేయనివారికి సైతం స్థాన చలనం కలుగుతోంది. ఒక స్థానాన్ని అయినవారికి కేటాయించేందుకు అక్కడున్నవారిని కదిలిస్తున్నారు. ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా, వారి అంగీకారాన్ని అడగకుండా బదిలీ చేసేస్తున్నారు. ఈ జాబితాలో కేవలం రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారు, చార్జెస్ ఉన్నవారు కూడా ఉండటం గమనార్హం. అయినవారికి ఇవ్వాలనుకుంటే తమకు సమాచారమైనా ఇవ్వాలి కదా..? చెప్పాపెట్టకుండా ఎలా బదిలీ చేస్తారని బాధితులు నిలదీస్తున్నారు. సిఫార్సులకు ప్రాధాన్యం ఇచ్చే క్రమంలో తమను బలిపశువులను చేస్తున్నారని మండిపడుతున్నారు. ఈ తతంగానికి జేడీఏ కార్యాలయం వేదికైంది. కౌన్సెలింగ్ ప్రక్రియను సోమవారం రాత్రి తలుపులు వేసుకుని మరీ కానిచ్చేశారు. ఈ అక్రమాల వెనుక ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లు ఉన్నాయా..? లేక ఆ శాఖ ఉన్నతాధికారుల అక్రమాలు ఉన్నాయా అన్న చర్చ జరుగుతోంది.



తప్పనున్న అక్రమ పనిష్మెంట్ల బెడద

సర్క్యులర్ 1/2019 పునరుద్ధరణతో విముక్తి

హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాలు

# ఆర్టీసీ ఉద్యోగులకు ఊరట

అనంతపురం కల్చరల్, మే 26(ఆంధ్రజ్యోతి): అక్రమ పనిష్మెంట్ల నుంచి విముక్తి కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు ఊరట లభించింది. గత వైసీపీ ప్రభుత్వం సర్క్యులర్ 1/2019ను నిర్వీర్యం చేయడంతో రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ఈనెల 22న సర్క్యులర్ తిరిగి అమలులోకి తీసుకొస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబునాయుడు చొరవతో ఆర్టీసీ అప్పటి ఎండీ సురేంద్రబాబు సర్క్యులర్ 1/2019ను ప్రవేశపెట్టి ఆర్టీసీలో పనిచేసే ఉద్యోగులు తెలిసీ తెలియక చేసిన తప్పులకు సర్క్యులర్ మేరకే పనిష్మెంట్లు ఉండేలా చర్యలు చేపట్టారు. తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసింది. తర్వాత సర్క్యులర్ 1/2019ను పక్కన పెట్టేయడంతో అప్పటి నుంచే ఆర్టీసీ వర్గాల్లో అసహనం మొదలైంది. గడిచిన ఐదేళ్లలో సర్క్యులర్ అమలులో లేని కారణంగా ఉద్యోగులకు ఇష్టారాజ్యంగా పనిష్మెంట్లు విధించడంతో పాటు చాలామందిని సస్పెండ్ చేస్తూ వచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే దాదాపు 300 మందికి పైగా ఈ అక్రమ పనిష్మెంట్లకు గురయ్యారంటే సర్క్యులర్ 1/2019 అమలు చేయకపోవడంవల్ల ఆర్టీసీ ఉద్యోగులు ఎంతగా నష్టపోయారో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సంఖ్య వేలల్లోనే ఉంటుంది. డ్రైవర్లు డ్రంకెన్ డ్రైవ్ చేసినపుడు గుర్తించినా, లేదా బస్సు ప్రమాదానికి గురైనా వారికి ఏడాది మొత్తంలో 16 పాయింట్ల వరకు పనిష్మెంట్ నుంచి మినహాయింపు ఇచ్చి, అవి దాటాకే సర్క్యులర్ మేరకు సస్పెండ్ చేసేవారు. వైసీపీ హయాంలో ఏ చిన్న తప్పు దొరికినా పెద్ద పనిష్మెంట్లు వేసేవారు. ఈ క్రమంలో అనంతపురం డిపో పరిధిలోనే ముగ్గురు డ్రైవర్లు సస్పెండ్ అయ్యారు. 2023లో తరిమెల వద్ద వినాయక చవితి ఉత్సవాల సమయంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి వచ్చి ఆర్టీసీ బస్సు కింద పడడంతో ఆ ప్రమాదం విషయంలోనూ సదరు బస్సు డ్రైవర్ ప్రసాద్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. ఇదే అదనుగా జిల్లా స్థాయిలో కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శించిన సందర్భాలూ వెలుగులోకి వచ్చాయి. వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన సర్క్యులర్ 1/2019ను ఎట్టకేలకు ప్రస్తుత ప్రభుత్వం తిరిగి అమలులోకి తీసుకురావడంతో.. ఇక నుంచి అక్రమ పనిష్మెంట్ల బెడద ఉండదంటూ ఆర్టీసీ ఉద్యోగులు ఊపిరి పీల్చుకుంటున్నారు.



మంత్రి లోకేశ్‌కు ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు వివరిస్తున్న జోనల్ చైర్మన్ పూల నాగరాజు (ఫైల్)

### మంత్రి లోకేశ్ చొరవ

రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు సర్క్యులర్ 1/2019 అమలు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ వచ్చారు. ఇదే అంశంపై ప్రస్తుత ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు దృష్టి సారించారు. ఈనెల 15, 16, 17వ తేదీల్లో రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అనంతపురం జిల్లాలో పర్యటించారు. ఆ సమయంలో పూల నాగరాజు మంత్రిని కలిసి సర్క్యులర్ అంశంతోపాటు ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు, కర్ణాటక బస్సుల్లో సీనియర్ సిటిజన్లకు రాయితీ అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన లోకేశ్ ఆర్టీసీ ఎండీ తిరుమలరావుకు సూచనలు చేశారు. ఈ క్రమంలో ఆర్టీసీ ఎండీ ఈనెల 22న సర్క్యులర్ 1/2019ను అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### ఉద్యోగుల సంక్షేమానికి సానుకూలం



ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి మా ప్రభుత్వం ఎప్పుడూ సానుకూలంగా ఉంటోంది. ఉద్యోగుల సమస్యను మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా వారం రోజుల్లోపే సర్క్యులర్ అమలుకు చర్యలు చేపట్టడం చూస్తే.. ఉద్యోగుల పట్ల ప్రస్తుత ప్రభుత్వానికి ఎంతటి సానుకూలత ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉద్యోగులందరూ ఆర్టీసీ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలి. అలాగే కార్గో ఆదాయం పెంచడంలోనూ చొరవ చూపాలి.

-పూల నాగరాజు, ఆర్టీసీ జోనల్ చైర్మన్

### ప్రభుత్వానికి ధన్యవాదాలు



సర్క్యులర్ 1/2019తోపాటు మా సమస్యలన్నింటినీ జోనల్ చైర్మన్, కార్మిక పరిషత్ రాష్ట్ర నాయకుల ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టికి పలుదఫాలుగా తీసుకెళ్లాం. సమస్యల పరిష్కారానికి నిరసన కార్యక్రమాలు సైతం చేపట్టాం. వాటన్నింటి ఫలితంగా నేడు సర్క్యులర్ 1/2019 అమలులోకి తెచ్చిన ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతున్నాం.

-వాసుదేవరెడ్డి, డ్రైవర్, కార్మిక పరిషత్ రీజనల్ అధ్యక్షుడు

# కార్యాలయమే ముద్దు..!

క్షేత్రస్థాయి విధులను ఇష్టపడని పీఆర్ ఇంజనీర్లు

ఉమ్మడి జిల్లాలో 40 మందే మండల ఇంజనీర్లు

వేధిస్తున్న కొరత.. అభివృద్ధి పనులకు ఇబ్బందులు

ఏడాదిగా సేదదీరుతున్న ఇన్‌చార్జి డీఈఈలు

నేడు రాయలసీమ స్థాయిలో బదిలీలకు కౌన్సెలింగ్

అనంతకు రానున్న ఈఎన్‌సీ బాలు నాయక్

అనంతపురం న్యూటౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): రాయలసీమ పరిధిలో పంచాయతీరాజ్ శాఖను ఇంజనీర్ల కొరత వేధిస్తోంది. ఈ సమస్య అభివృద్ధికి ఆటంకంగా మారింది. ఈ విభాగంపై పట్టున్నవారు క్షేత్రస్థాయి స్థానాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. కార్యాలయ పనులకే పరిమితమౌతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది అంటే గుర్తుకువచ్చేది మండల ఇంజనీర్లు, జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు. కోర్టు కేసుల కారణంగా వీరికి ఉద్యోగోన్నతులు కల్పించడం లేదు. దీంతో రెగ్యులర్ డీఈఈల కొరత ఏర్పడింది. సమస్య పరిష్కారం కోసం స్థానిక ఉన్నతాధికారులు వర్కింగ్ అరేంజ్‌మెంట్ కింద పలువురు జేఈఈలకు ఇన్‌చార్జి డీఈఈలుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇన్‌చార్జి డీఈఈలు పూర్తిస్థాయిలో ఆ బాధ్యతలను నిర్వర్తించలేకున్నారు. తాము చేయలేక, తమకు సమానమైన జేఈఈలతో పనులు చేయించుకోలేక ఎక్కువ శాతం మండల ఇంజనీర్లపై ఆధారపడుతున్నారు. చాలామంది ఇన్‌చార్జి డీఈఈలు కార్యాలయాలకే పరిమితమౌతున్నారు. గత ఏడాది జరిగిన బదిలీల్లో కోరుకున్న స్థానాల్లోకి చేరిన పలువురు పనులు మానేసి సేదదీరుతున్నారని విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఐదేళ్లు ఒకేచోట పనిచేసినవారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. కానీ గత ఏడాది ఇన్‌చార్జి డీఈఈలుగా బదిలీపై వచ్చినవారికి ఈ నిబంధనతో పెద్దగా ఇబ్బంది ఉండదని అంటున్నారు.

### కదిలించడం సాధ్యమేనా..?

బదిలీల ప్రక్రియలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజనీర్లతో సోమవారం మధ్యాహ్నం జూమ్‌మీట్ నిర్వహించారు. మండల ఇంజనీర్లు, జేఈఈలు కార్యాలయాల్లో ఉండటానికి వీలు లేదని స్పష్టం చేశారు. ఇన్‌చార్జి డీఈఈల స్థానాలను సైతం బదిలీల షెడ్యూల్‌లో ఖాళీలుగా చూపించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. దీంతో ఏడాదిగా ఇన్‌చార్జి హోదాలో కార్యాలయాలకు పరిమితమైనవారిలో టెన్షన్ మొదలైంది. నాయకుల మద్దతు ఉన్నవారు తమ జోలికి ఎవరూ రారన్న ధీమాలో ఉన్నారు. సిఫార్సులకు తావులేకుండా ఈఎన్‌సీ బదిలీ ప్రక్రియ పూర్తి చేసే అవకాశం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో కార్యాలయాల్లో మకాం వేసిన వారిని క్షేత్రస్థాయికి పంపడం సాధ్యమేనా అనే చర్చ జరుగుతోంది.

### సిఫార్సుల కోసం..

బదిలీలలో లబ్ధి పొందేందుకు కొందరు ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే సిఫార్సు లేఖల కోసం క్యూ కడుతున్నారు. 'ఉమ్మడి జిల్లా సిబ్బందికి సంబంధించి అన్నీ నేను చూసుకుంటాను. మీకు ఏది కావాలో చెప్పండి. నేను మాట్లాడతాను' అని శ్రీసత్యసాయి జిల్లాలోని ఓ ఈఈ భరోసా ఇస్తున్నారని ప్రచారం జరుగుతోంది. తన అనుయాయుల కోసం కొన్ని స్థానాలను ఆయన రిజర్వు చేసుకున్నారని అంటున్నారు. ఇప్పటికే పలు విభాలకు సంబంధించి కొన్ని ప్రాంతాల్లో బదిలీలు పూర్తయ్యాయి. విధుల్లో చేరేముందు స్థానిక ప్రజా ప్రతినిధులను కలవడానికి వెళితే.. 'నిన్నెవరు నియమించారు..? నాకు తెలియకుండా నా నియోజకవర్గంలోకి ఎలా వస్తారు..? మీరు వద్దులే.. మా వాళ్లకి ఇప్పటికే లెటర్ ఇచ్చాం' అని అంటున్నట్లు తెలిసింది. దీంతో నానా తంటాలు పడి బదిలీ ఉత్తర్వులు తీసుకున్న వారికి భంగపాటు తప్పడం లేదని అంటున్నారు. పంచాయతీరాజ్‌లో కూడా ఇదే సీన్ రిపీట్ అయ్యే అవకాశం ఉందని అంటున్నారు.



పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయం

### ఇంజనీర్ల కొరత..

నిబంధనల ప్రకారం ఉమ్మడి జిల్లాలోని 63 మండలాలకు ఒక్కో మండల ఇంజనీరు చొప్పున ఉండాలి. కానీ 40 మంది మాత్రమే ఉన్నారు. మిగిలిన మండలాలకు మండల ఇంజనీర్లే లేరు. ఉన్న వారికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి కాలం నెట్టుకొస్తున్నారు. దీంతో ఒక మండలం చూడాల్సిన వారు రెండు, మూడు మండలాలు చూడాల్సి వస్తోంది. ఇది విధులకు ఇబ్బందికరంగా మారింది. అభివృద్ధి పనులకు ఆటంకం ఎదురవుతోంది. ఇలా తంటాడు పడటం కంటే డీఈఈ హోదాలో ఇన్‌చార్జిగా కాలం గడపటమే మేలని చాలామంది భావిస్తున్నారని తెలిసింది. ఉన్నవారిలో కార్యాలయ డీఈఈలుగా కొందరు, క్వాలిటీ కంట్రోల్ విభాగానికి కొందరు, పీఐయూకు కొందరు వెళ్లారు. గత నెలలో ఉద్యోగ విరమణ పొందిన పీఐయూ జేఈఈ రామచంద్రారెడ్డి ఇన్‌చార్జి పీఐయూ డీఈఈగానే ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో ప్రస్తుతం ఉన్న నారాయణస్వామి జేఈఈ నుంచే ఇన్‌చార్జి డీఈఈగా కొలువుదీరారు. క్వాలిటీ కంట్రోల్ జేఈఈగా ఉన్న కృష్ణజ్యోతి పీఆర్ సబ్ డివిజన్-2 ఇన్‌చార్జి డీఈఈగా కొలువుదీరారు. ఇలాంటివారు చాలామందే ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది.

### నేడు బదిలీల కౌన్సెలింగ్..

రాయలసీమలోని నాలుగు జిల్లాల పంచాయతీరాజ్ సిబ్బందికి అనంతపురం పీఆర్ ఎస్ఈ సర్కిల్ కార్యాలయంలో ఈఎన్‌సీ బాలు నాయక్ మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఇందులో ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారికి తప్పని సరి బదిలీ తథ్యమని అంటున్నారు. అనంతపురం జిల్లాలో ఐదుగురు డీఈఈలు, శ్రీసత్యసాయి జిల్లాలో ఇద్దరు డీఈఈలు ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారి జాబితాలో ఉన్నారు.

## మార్కెటింగ్ శాఖలో బదిలీలు

### నేడు కమిషనర్ కార్యాలయంలో కౌన్సెలింగ్

అనంతపురం రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): జిల్లా మార్కెటింగ్ శాఖలో బదిలీల ప్రక్రియ మొదలయింది. మంగళవారం విజయవాడలోని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఏడీ సత్యనారాయణచౌదరి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఐదేళ్లు పూర్తయిన వారు 22 మంది ఉన్నట్లు వివరించారు. ఇందులో ఇద్దరు యూడీసీలు, 11 మంది సూపర్‌వైజర్లు, ఇద్దరు ఏఎంఎస్‌లు, ఒక ఎల్‌డీసీ, ఇద్దరు బిడ్‌క్లర్క్‌లు, ఒక గ్రేడర్, ఒక అటెండర్, ఇద్దరు వాచ్‌మెన్లు ఉన్నట్లు తెలిపారు. వీరితో పాటు ఒకేచోట ఐదేళ్లు పూర్తి కానివారు కూడా బదిలీల కోసం మరో 23 మంది రిక్వెస్టు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఆ మేరకు కౌన్సెలింగ్‌కు ఉద్యోగులు, సిబ్బంది సోమవారం రాత్రి విజయవాడకు పయనమయ్యారు.

### 92 మంది వెటర్నరీ సిబ్బందికి కౌన్సెలింగ్

అనంతపురం అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పశుసంవర్థక శాఖలో పనిచేస్తున్న 92 మంది సిబ్బందికి సోమవారం స్థానిక జేడీ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల జేడీలు వెంకటస్వామి, శుభదాస్.. ఆఫీస్ సబార్డినేట్లు, వెటర్నరీ అసిస్టెంట్లు, డ్రైవర్లకు ఆప్షన్ల మేరకు కౌన్సెలింగ్ నిర్వహించి, స్థానాలు ఖరారు చేశారు. వెటర్నరీ డాక్టర్లు, లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు, జూనియర్, సీనియర్ వెటర్నరీ ఆఫీసర్లు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, ఏడీలు, డీడీల దరఖాస్తులను పరిశీలించి, రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపినట్లు జేడీ వెంకటస్వామి పేర్కొన్నారు.

### నేడు గ్రేడ్-2 హెచ్‌ఎం ప్రమోషన్లకు వెరిఫికేషన్

అనంతపురం విద్య, మే 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్లకు సీనియారిటీ జాబితాలోని పీఎస్ హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రమోషన్ల కోసం టీచర్ల ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాను అనంతపురం డీఈఓ బ్లాగ్‌స్పాట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. జాబితాలోని ప్రైమరీ హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు తమ ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లు, ఎస్సీ ఉపాధ్యాయులు కుల ధ్రువీకరణ పత్రాలు, పీహెచ్ టీచర్లు ఒరిజినల్ పత్రాలతోపాటు మెడికల్ బోర్డు సర్టిఫికెట్లు, ఎస్‌ఆర్ బుక్స్‌తో రావాలన్నారు. అనంతపురం నగరంలోని శారదా మున్సిపల్ హైస్కూల్‌లో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని ఆయన సూచించారు.

## విద్యాశాఖలో 11 బృందాల ఏర్పాటు

- బదిలీలు, ప్రమోషన్ల కోసం నియామకం
- సభ్యులుగా ఏడీలు, సూపరింటెండెంట్లు, ఎంఈఓలు
- ఒక్కో టీంకు 4 నుంచి 8 మండలాల బాధ్యతలు

అనంతపురం విద్య, మే 26(ఆంధ్రజ్యోతి): బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యాశాఖాధికారులతో 11 బృందాలను నియమించారు. ఏడీలు, సూపరింటెండెంట్లు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఇతర రెండు జిల్లాల విద్యాశాఖ క్లరికల్ స్టాఫ్‌తో కలిపి 11 టీమ్స్ ఏర్పాటు చేశారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఏడీలు, సూపరింటెండెంట్లు, ఎంఈఓలు, ఐటీ సెల్ సిబ్బంది, టెక్నికల్ స్టాఫ్ సభ్యులుగా ఉంటారు. ఒక్కో బృందానికి 4 నుంచి 8 మండలాల వరకూ కేటాయించారు. బదిలీలు, ప్రమోషన్లు, స్కూళ్ల పునర్విభజన, హేతుబద్ధీకరణపై ఉపాధ్యాయుల నుంచీ వచ్చే అభ్యంతరాలు, వినతులు స్వీకరిస్తారు. 63 మండలాలను 11 కౌంటర్లుగా విభజించారు. ప్రత్యేకంగా కేటాయించిన కౌంటర్లలో సంబంధిత మండలాల టీచర్లు తమకు ఎదురయ్యే సాంకేతిక, ఇతర సర్వీస్ సమస్యలు, వినతులను కౌంటర్ ఇన్‌చార్జిలు, ఇతర ఎంఈఓలు, టెక్నికల్ పర్సన్ల దృష్టికి తీసుకెళ్లేలా అనంతపురం డీఈఓ ప్రసాద్‌బాబు బృందాలను నియమించారు.

| టీం | మండలాలు | కౌంటర్ ఇన్‌చార్జిలు | అలాటెడ్ పర్సన్స్ | టెక్నికల్ సిబ్బంది |
|---|---|---|---|---|
| 1 | అనంతపురం, ఆత్మకూరు, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం | క్రిష్ణయ్య (ఏడీ), ఆదినారాయణ (సూపరింటెండెంట్) | హరికృష్ణ (ఎంఈఓ-2), అనిల్ (క్లర్క్) | మారుతి (ఎస్‌జీటీ) |
| 2. | కూడేరు, నార్పల, పెద్దపప్పూరు, శింగనమల, రాప్తాడు, పుట్లూరు | క్రిష్ణయ్య(ఏడీ), సరళ (సూపరింటెండెంట్) | నారపరెడ్డి(ఎంఈఓ-2), మారుతీసుధాకర్ (ఎస్‌ఏ) | మారుతి (ఎస్‌జీటీ) |
| 3. | తాడిపత్రి, యల్లనూరు, గుత్తి, గుంతకల్లు | క్రిష్ణయ్య(ఏడీ) ఆదినారాయణ (సూపరింటెండెంట్) | మదన్(ఎంఈఓ-2), షబీనా, హరిక్రిష్ణ (ఆఫీస్ స్టాఫ్) | మంజునాథ్ (ఏపీఓ) |
| 4. | పెద్దవడుగూరు, ఉరవకొండ, విడపనకల్లు, యాడికి, వజ్రకరూరు | క్రిష్ణయ్య(ఏడీ) శాంతకుమారి (సూపరింటెండెంట్) | సాయిక్రిష్ణ(ఎంఈఓ-2), జిలాన్, రాజేష్ (ఆఫీస్ స్టాఫ్) వెంకటరమణ(ఎంఈఓ-2), చంద్రకాంత్, హనుమంతు | మంజునాథ్ (ఏపీఓ) గురుమునిక్రిష్ణ |
| 5. | బెలుగుప్ప, బొమ్మనహాల్, డీ హీరేహాళ్ బ్రహ్మసముద్రం, గుమ్మఘట్ట, కళ్యాణదుర్గం | క్రిష్ణయ్య (ఏడీ) ఆదినారాయణ (సూపరింటెండెంట్) | | |
| 6. | కంబదూరు, కణేకల్లు, కుందుర్పి, రాయదుర్గం, శెట్టూరు | క్రిష్ణయ్య(ఏడీ) సరళ (సూపరింటెండెంట్) | మోహన్‌బాబు(ఎంఈఓ-2), గాయత్రి, రామ్మోహన్ | గురుమునిక్రిష్ణ |
| 7. | బత్తలపల్లి, సీకేపల్లి, ధర్మవరం కనగానపల్లి, ముదిగుబ్బ, రామగిరి తాడిమర్రి | శ్రీనివాసరావు (ఏడీ) కామరాజ్ (సూపరింటెండెంట్) | ప్రసన్నకుమార్(ఎంఈఓ-2), సురేష్‌కుమార్, సాయినాథ్ | మస్తాన్ ఖాన్ |
| 8. | అమడగూరు, గాండ్లపెంట, కదిరి నల్లచెరువు, తలుపుల | శ్రీనివాసరావు(ఏడీ) పురుషోత్తం (సూపరింటెండెంట్) | నరేంద్ర(హెచ్‌ఎం), శ్యాంకుమా ర్, ఆరిఫ్ | మస్తాన్ ఖాన్ |
| 9. | అగళి, అమరాపురం, చిలమత్తూరు గుడిబండ | శ్రీనివాసరావు (ఏడీ) కామరాజ్(సూపరింటెండెంట్) | వెంకటేశులు(ఎంఈఓ-2), చక్రధర్, శివకుమారి | చంద్రమోహన్, ఏఎస్ఓ |
| 10. | లేపాక్షి, మడకశిర, పరిగి, రొద్దం పెనుకొండ | శ్రీనివాసరావు (ఏడీ) పురుషోత్తం (సూపరింటెండెంట్) | సుధాకర్ (ఎంఈఓ-2), జయరాం (ఏపీఓ), లోకేశ్ | చంద్రమోహన్, ఏఎస్ఓ |
| 11. | రొళ్ల, సోమందేపల్లి, గోరంట్ల బుక్కపట్నం, కొత్తచెరువు, ఓడీసీ నల్లమాడ, పుట్టపర్తి | శ్రీనివాసరావు (ఏడీ) పురుషోత్తం (సూపరింటెండెంట్) | శ్రీదేవి (ఎంఈఓ-2), నాగరాజు (క్లర్క్) | ప్రకాష్‌రెడ్డి (ఎస్‌జీటీ) |

# భూసందేహ పరీక్షలు..!

## మట్టి నమూనాల సేకరణలో తీవ్ర జాప్యం

**సగం కూడా పూర్తికాని దుస్థితి**

**సేకరించినవీ.. ల్యాబ్‌కు చేరని వైనం..**

**సిద్ధంకాని పెనుకొండ కేంద్రం**

**సిబ్బంది నియామకం ఎన్నడో..?**



ముదిగుబ్బ మండలం బ్రాహ్మణపల్లి పొలంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది



మట్టి నమూనాలు లేకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న అనంతపురం భూసార పరీక్ష కేంద్రం ఆవరణం

అనంతపురం అర్బన్/ధర్మవరం/కొత్తచెరువు/పెనుకొండ రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది భూసార పరీక్షలు సవ్యంగా సాగేనా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మట్టి నమూనాల సేకరణలో తీవ్ర జాప్యమవుతోంది. సేకరించిన వాటిల్లో ఒక్కటి కూడా భూసార పరీక్షాకేంద్రాలకు పంపలేదు. పెనుకొండ పరీక్షాకేంద్రానికి ఇంకా మరమ్మతులు చేస్తున్నారు. సిద్ధం కూడా కాలేదు. పరీక్షలు చేయడానికి సిబ్బంది లేరు. సిబ్బందిని నియమించేదెపుడు, మట్టి పరీక్షలు చేసేటపుడు, వాటి ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేదెపుడన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### లక్ష్యం 48,266..


ఉమ్మడి అనంత జిల్లాకు ఈసారి 48,266 భూసార పరీక్షలు చేయాలని టార్గెట్ విధించారు. ఇందులో అనంతకు 25,107, శ్రీసత్యసాయి జిల్లాకు 23,159 భూసార పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆశించిన మేరకు పలు మండలాల్లోని రైతు సేవాకేంద్రాల పరిధిలో మట్టినమూనాలు సేకరించడం లేదన్న విమర్శలున్నాయి. గత వైసీపీ పాలనలో భూసార పరీక్షలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారు. దీంతో రైతులు భూసార హెల్త్ కార్డులకు దూరమయ్యారు. దీని ప్రభావం పంట దిగుబడులపై పడటంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా నిర్దేశించిన సమయంలోగా మట్టి నమూనాలు సేకరించడంతోపాటు భూసార పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాల్సి ఉంది. మరి ఏ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.

### విత్తుకు సిద్ధమవుతున్న రైతులు

గతేడాదితో పోలిస్తే ఈసారి ముందస్తుగానే సోమవారం ఉదయం జిల్లాలోకి నైరుతిరుతు పవనాలు ప్రవేశించాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పలుప్రాంతాల్లో రైతులు సేద్యం పనులు పూర్తి చేసుకున్నారు. ఖరీఫ్ ప్రారంభంలో వర్షం పడితే విత్తనం వేసేందుకు ఆయా రైతులు సిద్ధం చేశారు. వర్షం పడి పొలం ఆరిన తర్వాతనే మట్టినమూనాలు తీయాలి. విత్తనం వేసిన తర్వాత మట్టి నమూనాలు తీసే అవకాశం ఉండదు. దీనిని దృష్టిలో ఉంచుకుని, నిర్దేశించిన సమయంలోగా మట్టి నమూనాలు సేకరించేలా ఉన్నతాధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. లేదంటే లక్ష్యం మేరకు మట్టి పరీక్షలు నిర్వహించడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యం

గత వైసీపీ పాలనలో భూసార పరీక్షలపై తీవ్ర నిర్లక్ష్యం వహించింది. 2019-20, 2020-21, 2021-22, 2022-23 సంవత్సరాల్లో ఒక్క భూసార పరీక్ష కూడా నిర్వహించలేదు. 2023-24లో 10వేలు, 2024-25లో 18,600 భూసార పరీక్షలతో సరిపెట్టారు. టీడీపీ హయాంలో భూసార పరీక్షలు చేయడంతోపాటు ప్రత్యేకంగా రైతులకు భూసార హెల్త్ కార్డులు జారీ చేస్తూ వచ్చారు. వైసీపీ పాలనలో భూసార హెల్త్‌కార్డుల జారీని పూర్తిగా నిలిపేశారు. భూసార పరీక్షల ద్వారా పొలాల్లో నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మ ధాతువులు జింక్, మాంగనీస్, కాపర్, బోరాన్ తదితర పోషకాలు ఏ పరిమాణంలో ఉన్నాయో తెలుస్తుంది. భూసార పరీక్షల ద్వారా ఆయా పొలాల్లో ఏయే రకాల పంటలు పండించవచ్చో తెలుసుకోవచ్చు. భూసార పరీక్షల ద్వారా సిఫార్సు చేసిన ఎరువులను తగిన మోతాదులో వాడితే మంచి దిగుబడి వస్తుంది. వైసీపీ పాలనలో భూసార పరీక్షలు చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో రైతులు ఎడాపెడా పొలాల్లో ఎరువులు వాడటం ద్వారా భూముల్లో సమతుల్యత లోపించి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.





పెనుకొండ భూసార పరీక్షా కేంద్రంలో మరమ్మతులు చేస్తున్న దృశ్యం

### ● నమూనాల సేకరణలో నిర్లక్ష్యం

సాయిల్ హెల్త్ యాప్‌లో ఫలితాలను అప్‌లోడ్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ముందుగా రైతు సేవాకేంద్రంలో సాయిల్ హెల్త్ కార్డు యాప్‌లో మట్టి నమూనాలు సేకరించే ఆయా పొలాల రైతు వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆ తర్వాత ఆర్‌ఎస్‌కే సిబ్బంది క్షేత్రస్థాయిలో పొలాల్లోకి వెళ్లి రైతుల సమక్షంలోనే మట్టి నమూనాలు తీయాలి. అక్కడే జీపీఎస్ కో-ఆర్డినేట్‌తో సదరు రైతుతో సెల్ఫీ దిగి, యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇప్పటిదాకా అనంతలో 11 వేలు, శ్రీసత్యసాయి జిల్లాలో 12,130 మట్టి నమూనాలు సేకరించారు. మిగతా వాటిని ఎప్పటిలోగా సేకరిస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని పలు రైతుసేవా కేంద్రాల పరిధిలో నిర్దేశించిన మేరకు రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. గత నెల 25వ తేదీ నుంచి మే నెలాఖరులోగా క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది మట్టి నమూనాలు సేకరించి, భూసార పరీక్షాకేంద్రానికి పంపాలి. అక్కడ ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి, వచ్చే ఖరీఫ్ సీజన్‌లోగా

### పరీక్షా కేంద్రాలకు చేరని మట్టి నమూనాలు

గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించిన మట్టి నమూనాలను అనంతపురం భూసార పరీక్షాకేంద్రానికి పంపేవారు. ఈ ఏడాది శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించిన మట్టి నమూనాలను పెనుకొండ భూసార పరీక్షాకేంద్రానికి పంపించి, అక్కడే పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటిదాకా అనంతపురం, పెనుకొండ భూసార పరీక్షాకేంద్రాలకు ఒక్క మట్టినమూనా కూడా చేర్చకపోవడం గమనార్హం. గత వైసీపీ పాలనలో ధర్మవరం, పెనుకొండ భూసార పరీక్షా కేంద్రాలు మూతపడ్డాయి. ఈ ఏడాది నుంచి పెనుకొండ భూసార పరీక్షాకేంద్రంలోపరీక్షలు చేయాలని నిర్ణయించడంతో ప్రస్తుతం మరమ్మతు పనులు చేసి, పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. అక్కడి భూసార పరీక్షాకేంద్రానికి కావాల్సిన ఏఓలు, ఇతర సిబ్బందిని ఇంకా నియమించలేదు. తగిన పరికరాలు, కెమికల్స్ కోసం ప్రతిపాదనల దశలోనే ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పెనుకొండలో ఎప్పటి నుంచి భూసార పరీక్షలు ప్రారంభిస్తారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. భూసార పరీక్షలు సవ్యంగా సాగకపోతే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. అనంతపురం భూసార పరీక్షాకేంద్రంలోనూ స్కిల్డ్, అన్‌స్కిల్డ్ సిబ్బందిని డైలీ లేబర్ కింద ఇంకా తీసుకోలేదు. మట్టి నమూనాలు వచ్చిన తర్వాత సిబ్బందిని తీసుకుంటామని ఆ శాఖ అధికారులు చెప్పుకొస్తున్నారు.

### ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలి



భూసార పరీక్షలు చేయించుకుని, వాటి ఆధారంగా తగిన మోతాదులో ఎరువులు వాడుకుంటే.. పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు దిగుబడులు బాగా పెరుగుతాయి. అందుకే ప్రతి రైతు భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలి. రైతు సేవాకేంద్రంలో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆ తర్వాత సిబ్బంది క్షేత్రస్థాయిలో పొలాలకు వచ్చి రైతుల సమక్షంలోనే మట్టినమూనాలు సేకరించి, పరీక్షాకేంద్రానికి పంపుతారు. భూసార పరీక్షాకేంద్రంలో మట్టి పరీక్షలు నిర్వహించి, రైతులవారీగా ఆన్‌లైన్‌లో భూసార పరీక్షల ఫలితాలు నమోదు చేస్తారు. క్షేత్రస్థాయిలో నిర్దేశించిన సమయంలోగా మట్టి నమూనాలు సేకరించి, పరీక్షా కేంద్రానికి పంపేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

**-సుబ్బారావు, శ్రీసత్యసాయి జిల్లా వ్యవసాయ శాఖాధికారి**

# మేమింతే.. మారమంతే..!

## కాసుల కోసం మద్యం వ్యాపారులతో దోస్తీ

**రేటు పెంచుకో...**

**మామూళ్లు ఇచ్చుకో..**

**ఎక్సైజ్ అధికారుల భరోసా**

**సివిల్ పోలీసులదీ అదే దారి**

**తనిఖీలకు మంగళం**



అనంతపురం, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా.. మద్యం పాలసీ మారినా.. ఎక్సైజ్ అధికారుల తీరుమారలేదు. మేమింతే.. మారమంతే.! అన్న చందంగా వారి వ్యవహార శైలి ఉంది. మద్యం పాలసీలో ప్రభుత్వ నిబంధలను అమలు చేయాల్సిన అధికారులు కాసుల కోసం షాపుల నిర్వాహకులతో ఒప్పందాలు కుదుర్చుకొని, కుమ్మక్కవుతున్నారు. రేటు పెంచుకో.. నెల మామూళ్లు ఇచ్చుకో అనే రీతిన ఉమ్మడి అనంత జిల్లా వ్యాప్తంగా ఆ శాఖాధికారులు పనితీరు ఉందన్న విమర్శలు ఉన్నాయి. సివిల్ పోలీసులు అదే దారి పట్టారు. ఎక్సైజ్, సివిల్ పోలీసులకు నెల మామూళ్లు ఇవ్వాలన్న సాకుతో మద్యం దుకాణాల నిర్వాహకులు క్వార్టర్‌పై రూ.10, బీరుపై రూ.10, ఫుల్ బాటిల్‌పై ఏకంగా బ్రాండ్‌ను బట్టి రూ.30 నుంచి రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారు. నెల మామూళ్లు ముడుతుండడంతో నియంత్రించాల్సిన అధికారులు కిమ్మనడం లేదు. అంతిమంగా మందుబాబుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. వైసీపీ పాలనలో ప్రభుత్వమే మద్యం విక్రయాలు జరిపిన నేపథ్యంలో మందుబాబుల నుంచి ఏ విధమైన వ్యతిరేకత వ్యక్తమైందో.. ప్రస్తుతం అదే పరిస్థితి కనిపిస్తోంది. పాలకులకు తెలిసినా మిన్నకుండిపోతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ వర్గాలకు వాటాలు వెళుతున్నాయేమోనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ప్రతి దుకాణం నుంచి మామూళ్లు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రతి మద్యం దుకాణం నుంచి ఎక్సైజ్ అధికారులు నెల మామూళ్లు వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఒక్కో మద్యం దుకాణం నుంచి ఏకంగా నెలకు రూ.40 వేల నుంచి రూ.50వేల దాకా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇందులో హోదాలను బట్టి పంపకాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఒక్కో బార్ నుంచి రూ.30వేల నుంచి రూ.40వేల దాకా వసూలు చేస్తున్నట్లు ఆ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి 243 మద్యం దుకాణాలు ఉండగా... సగటున నెలకు మామూళ్ల రూపంలో ఎక్సైజ్‌శాఖకు రూ.కోటి దాకా మద్యం దుకాణాల నిర్వాహకులు ముట్ట జెబుతున్నట్లు ఆ వర్గాలే బాహాటంగా చెప్పుకుంటున్నాయి. ఇక 29 బార్లకుగాను నెలకు సగటున రూ.9 లక్షలదాకా మామూళ్ల రూపంలో చెల్లించాల్సిన పరిస్థితులు ఉన్నట్లు సమాచారం.

### సివిల్ పోలీసులదీ అదే దారి..!

మద్యం పాలసీ నిబంధనలను అమలు చేయాల్సిన బాధ్యత ఎక్సైజ్ అధికారులపై ఉంది. ఆ శాఖ అధికారులు ఆ బాధ్యతను విస్మరించి నెల మామూళ్లకు ఒప్పందాలు కుదుర్చుకున్నారన్న ఆరోపణలు నేపథ్యంలో.. సివిల్ పోలీసులు మద్యం దుకాణాలపై కన్నెత్తి చూడటం లేదు. ఎక్సైజ్ అధికారుల బాటలోనే సివిల్ పోలీసులు అదే దారిని ఎంచుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్కో మద్యం దుకాణం నుంచి మండల కేంద్రాల్లో నెలకు రూ.15వేలు, పట్టణాల్లో రూ.25వేల దాకా మామూళ్లు దండుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో మద్యం దుకాణాల నిర్వాహకులు ఎమ్మార్పీలకు మంగళం పాడారనే విమర్శలు ఉన్నాయి.

### వ్యాపారుల చేతివాటం

మద్యం దుకాణాల నిర్వహణలో.. మద్యం పాలసీ నిబంధనలకు తూట్లు పొడిచినా.. ఎమ్మార్పీ కంటే అదనంగా విక్రయించినా.. అటు ఎక్సైజ్ అధికారులు, ఇటు పోలీసు అధికారుల నుంచి ఎలాంటి ఇబ్బందులు తలెత్తవన్న ధీమాతో మద్యం దుకాణాల నిర్వాహకులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. మద్యం దుకాణాల పరిధిలో ఇబ్బడిముబ్బడిగా బెల్ట్ షాపులు నిర్వహించుకునేందుకు నిర్వాహకులే తెరతీశారు. ఒక్కో బెల్ట్ షాపు నిర్వహణ, మద్యం సరఫరా చేసినందుకుగాను రూ.50వేలు బెల్ట్ షాపుల నిర్వాహకుల నుంచి వసూలు చేసినట్లు సమాచారం. కొత్తగా బెల్ట్ షాపు పెట్టుకోవాలంటే... ఆ మద్యం దుకాణం నిర్వాహకులకు రూ.50వేలు ముట్టజెబితేనే మద్యం సరఫరా చేసేలా ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,800 దాకా బెల్ట్ షాపులు ఏర్పడినట్లు తెలుస్తోంది.

### తనిఖీలకు మంగళం

ఎమ్మార్పీలకే మద్యం విక్రయించాలి.. బెల్ట్ షాపుల నియంత్రణ, నిర్దేశించిన సమయంలోనే దుకాణాలు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. నెల మామూళ్ల ఒప్పందం నేపథ్యంలో తనిఖీలకు మంగళం పాడారన్న విమర్శలు ఉన్నాయి. పర్మిట్ రూమ్‌లకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి మద్యం దుకాణం వద్ద అనధికారికంగా పర్మిట్ రూంలు వెలిశాయి. వీటి నియంత్రణను గాలికి వదిలేశారు. ఆకస్మిక తనిఖీలు... దకాయ్ ఆపరేషన్‌లకు చెల్లుచీటీ పాడారు. ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాల నిర్వహణ గాడి తప్పడానికి కాసుల వ్యవహారమే ప్రధాన కారణమని తెలుస్తోంది. ఈ వ్యవహారాలన్నీ చక్కదిద్ది ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా పాలకులు, జిల్లా యంత్రాంగం ఏ మేరకు దృష్టి సారిస్తుందో చూడాలి.

## చిల్లకొండయ్యపల్లి వద్ద పుర్రె లభ్యం

తాడిమర్రి, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకొండయ్యపల్లి సమీపంలో సోమవారం గొర్రెల కాపరులు ఓ పుర్రెను గుర్తించారు. ఆదివారం సాయంత్రమే కొందరు అక్కడ ఓ సంచి ఉన్నట్లు చూశారు. సోమవారం ఉదయం వెళ్లే సరికి సంచి సమీపంలో పుర్రె పడి ఉండటాన్ని గమనించి గ్రామస్థులకు తెలిపారు. దీంతో వారు పోలీసులకు సమాచారం చేరవేశారు. ఎస్ఐ క్రిష్ణవేణి, ఏఎస్ఐ సూర్యనారాయణరాజుతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి పుర్రెను అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా పుర్రె పురుషులదా స్ర్తీలదా అన్నది తెలుస్తుందన్నారు. పుర్రెకు సంబంధించిన మొండెం సమీపంలో ఎక్కడా కనిపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పుర్రెను ప్లాస్టిక్ కవర్లలో చుట్టి సంచిలో ఉంచి అక్కడ పడవేసినట్టుగా తెలుస్తోంది.



పుర్రెను పరిశీలిస్తున్న పోలీసులు

### సెలవులోకి డీఎఫ్ఓ

అనంతపురం న్యూటౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీ శాఖాధికారి (డీఎఫ్ఓ) విఘ్నేష్ 27 రోజులపాటు వ్యక్తిగత పనులపై సెలవులో వెళ్లారు. తిరిగి జూన్ 22న ఆయన విధుల్లో చేరనున్నారు. కర్నూలు డీఎఫ్ఓ శ్యామలకు జిల్లా అదనపు బాధ్యతలు అప్పగించారు.

## దరఖాస్తు చేసుకోండి..!

అనంతపురం సెంట్రల్, మే26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (ఏపీటీడబ్ల్యూఆర్) పాఠశాలల్లో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి అంజేయులు సోమవారం ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి మూడు నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎస్టీ) సామాజికవర్గానికి చెందిన బాలబాలికలు అర్హులన్నారు. ఖాళీ సీట్లకంటే అధికంగా దరఖాస్తులు వస్తే.. జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి కార్యాలయంలో లాటరీ తీస్తామన్నారు. జూన్ 4వతేదీన లాటరీ ఉంటుందన్నారు.

### ఇంటర్మీడియట్ ప్రవేశానికి..

గుత్తి మండలం గొల్లలదొడ్డిలోని గిరిజన గురుకుల పాఠశాల(బాలురు)లో ఇంటర్మీడియట్ ప్రవేశాల ప్రక్రియను చేపట్టినట్లు ప్రిన్సిపాల్ ఫయాజ్ అహ్మద్ తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో 2025-26 మొదటి సంవత్సరం ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9885369079, 8978239363, 8341603090 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## పథకాల లబ్ధికి పోస్టల్ ఖాతాలు

**31 నుంచి ప్రత్యేక శిబిరాలు**

**తపాలాశాఖ సూపరింటెండెంట్ ఆదినారాయణ**

అనంతపురం సెంట్రల్, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల లబ్ధిని పొందేందుకు ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) ఖాతాలు వర్తిస్తాయని తపాలాశాఖ సూపరింటెండెంట్ ఆదినారాయణ తెలిపారు. స్థానిక హెడ్ పోస్టాఫీసులో సోమవారం అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వరరావుతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బ్యాంకింగ్ సేవలకోసం వ్యయప్రయాసలకోర్చి పట్టణాలు, నగరాలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. పోస్ట్‌బ్యాంకు ఖాతాదారులు వారి ఇంటి వద్ద నుంచే తపాలా ఉద్యోగుల ద్వారా సేవలు పొందవచ్చన్నారు. కొత్తగా పోస్ట్‌బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు ఈనెల 31 నుంచి జూన్ 4వ తేదీ వరకు ప్రత్యే శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోస్ట్ బ్యాంకు ఖాతాదారులు 13,480 మందికి ఎన్‌పీసీఐ లింక్ కాలేదన్నారు. వారందరికీ ఆధార్ సీడింగ్ ద్వారా ఎన్‌పీసీఐ లింక్ చేయిస్తామన్నారు. సాధారణ రోజుల్లోనూ ఆధార్ సీడింగ్‌తో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు పొదుపు ఖాతాలు చేయిస్తామన్నారు. 18ఏళ్లు పైబడిన వారందరూ అర్హులనీ, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలని కోరారు.

## చీనీ టన్ను రూ.34 వేలు



అనంతపురం రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 34,120 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 5వేలు, సరాసరి రూ. 20వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 788 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.



## సౌదీలో చిక్కుకున్న ధర్మవరం యువకుడు

**స్వదేశానికి రప్పించేందుకు**

**మంత్రి సత్యకుమార్ యాదవ్ చర్యలు**

ధర్మవరం, మే 26(ఆంధ్రజ్యోతి): సౌదీఅరేబియాలో చిక్కుకున్న ధర్మవరం యువకుడిని స్వదేశానికి రప్పించేందుకు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు బీజేపీ కార్యాలయ ఇన్‌చార్జి హరీశ్‌బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. పట్టణానికి చెందిన సయ్యద్ ఫారూక్ ఇటీవల ఉపాధి కోసం సౌదీఅరేబియాకు వెళ్లి, అక్కడే బందీగా ఉండిపోయాడు. పుట్టపర్తికి చెందిన ఓ ఏజెంట్ ద్వారా డ్రైవర్ ఉద్యోగం కోసం వెళ్లిన ఫారూక్ అక్కడ చిక్కుకున్నారు. ఆహారం, నివాసం లేకుండా, జీతాలులేని దయనీయ పరిస్థితిలో ఉన్నాడు. ఫారూక్ పాస్‌పోర్టును కూడా స్వాధీనం చేసుకుని, ఇబ్బందులకు గురిచేస్తున్నారని అతడి కుటుంబసభ్యులు.. హరీశ్‌బాబుకు చెప్పారు. ఆయన వెంటనే మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి.. కేంద్రవిదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్‌సింగ్‌కు లేఖ రాశారు. అందులో మంత్రి మూడు కీలక అంశాలను పేర్కొన్నారు. ఫారూక్‌కు ప్రాణరక్షణ కల్పించాలనీ, అతడి పాస్‌పోర్టు తిరిగి ఇప్పించాలనీ, భారత దౌత్య కార్యాలయం ద్వారా నిరంతరం కమ్యూనికేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఫారూక్‌ను స్వదేశానికి రప్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు హరీశ్‌బాబు స్పష్టం చేశారు.

## గూగూడు బ్రహ్మోత్సవాలపై సమీక్ష

**భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలి**

**ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ**

నార్పల, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూగూడు గ్రామంలో వెలసిన కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాలపై సోమవారం వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు సమీక్ష నిర్వహించారు. ఆలయ కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జూన్‌లో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారన్నారు. వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం స్వామివారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా నేత ఆలం వెంకటనరసానాయుడు, మండల నాయకులు ఆకుల ఆంజనేయులు, దేవదాయ శాఖాధికారులు, కమిటీ సభ్యులు, అన్ని శాఖల మండల అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

## న్యూస్ బాక్స్

### పరీక్షకు 445 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మే 26(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా అడ్వాన్స్‌డ్ పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం సోషల్ పరీక్షతో ముగిశాయి. ఈ పరీక్షలు 2,911 మంది రాయాల్సి ఉండగా 2,466 మంది పరీక్షలు రాశారని, 445 మంది గైర్హాజరయ్యారని డీఈఓ తెలిపారు. ఈ సప్లమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ఆయన తెలిపారు.

### శ్రీశైలానికి బస్సు సర్వీసు

కదిరిఅర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల కోరిక మేరకు కదిరి నుంచి కడప మీదుగా శ్రీశైలానికి బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ మైనొద్దీన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ఈబస్సు సర్వీసు తాడిపత్రి మీదుగా వెళ్లేదని, ప్రయాణీకుల విజ్ఞప్తి మేరకు పులివెందల, వేంపల్లి, కడప, మైదుకూరు, నంద్యాల మీదుగా ఈ బస్సును శ్రీశైలం వెళ్తుందని అన్నారు. ఈబస్సు ప్రతిరోజు రాత్రి 7.30 గంటలకు బలయలు దేరి మరసటిరోజు ఉదయం 6.15కు శ్రీశైలం చేరుతుందన్నారు. అలాగే అక్కడ నుంచి సాయంత్రం రూ.6.30 గంటలకు బయలు దేరిన కదిరి మరసటిరోజు ఉదయం 5.30కు వస్తుందన్నారు. రిజర్వేషన్ సౌకర్యముందున్నారు. ఈఅవకాశాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### తాగునీటి సమస్య పరిష్కారం

ముదిగుబ్బ, మే 26(ఆంధ్రజ్యోతి):ముదిగుబ్బ మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు పంప్ హౌస్‌లో రెండు కొత్త మోటర్లను ఏర్పాటుచేశారు. వీటిని ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ సోమవారం ప్రారంభించారు. మంత్రి సత్యకుమార్ ఆదేశాలతో ఎంపీపీ మండల గ్రాంట్ నుంచి ప్రత్యేక నిధులతో వీటిని ఏర్పాటు చేశామన్నారు. వాటి ద్వారా ప్రతిరోజు 13 లక్షల లీటర్ల నీరు పంపింగ్ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దివాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రసాద్, వైస్ ఎంపీపీ వెంకటరెడ్డి, ఎంపీటీసీ మంజునాథ్, నాగభూషణ్, గంగాధర్ రెడ్డి, గడ్డం మోహన్ యాదవ్ పాల్గొన్నారు.

### హైవోల్టేజీతో కాలిపోయిన విద్యుత్ పరికరాలు

ఓబుళదేవరచెరువు, మే26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విద్యుత్ హైవోల్టేజీ రావడంతో పలువురి గృహాల్లోని విద్యుత్ పరికరాలు, కంప్యూటర్లు సోమవారం కాలిపోయాయి. సోమవారం మధ్యాహ్నం విద్యుత్ ఒక్కసారిగా హైవోల్టేజీ రావడంతో ఫ్రిజ్‌లు, కూలర్లు, ఫ్యాన్లు, కంప్యూటర్లు, సీసీ కేమెరాలు, టీవీలు, విద్యుత్ బల్బులు, కాలిపోయాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలా సమస్యలు ఏర్పడుతున్నాయని బాధితులు వాపోయారు.

### గిరిజన సలహా మండలి సభ్యుడికి సన్మానం

కదిరిఅర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గిరిజన సలహామండలి సభ్యుడు సోమ్లానాయక్‌ను సోమవారం కదిరి డివిజన్ బంజార ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సలహా మండలి సభ్యుడిగా మండలంలోని సున్నపుగుట్టతండాకు చెందిన సోమ్లానాయక్‌ను నియమించింది. కార్యక్రమంలో అనీల్‌నాయక్, రవినాయక్, నాగరాజునాయక్, బాలాజీనాయక్, నరసింగనాయక్, బాలునాయక్, శివనాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

### రేపు యోగాపై అవగాహన ర్యాలీ

పుట్టపర్తి రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలో బుధవారం పెద్దఎత్తున యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామసచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి జూన్ 21 వరకు యోగాపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలో గ్రామస్థాయిలో ఇంటింటి సర్వేలో ఇప్పటి వరకు 5800 కుటుంబాలను సర్వే చేయగా 1000 మందికి పైగా యోగా కార్యక్రమంలో పాల్గొనడానికి పేర్లు నమోదు చేయించుకున్నారన్నారు. గ్రామసచివాలయ సిబ్బంది గ్రామస్థాయిలో ఇంటింటికి వెళ్లి అందరూ యోగాలో పాల్గొనే విధంగా అవగాహన కల్పించాలన్నారు. యోగా శిక్షణ కోసం ప్రతిగ్రామంలో సచివాలయానికి మాస్టర్‌ట్రైనర్, యోగాగురువు, డ్రిల్ టీచర్లను నియమిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఓబుళదేవరచెరువు, మే26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సత్యమ్మ బజారు, జామీయ మసీదు వీధుల్లో నెలకున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆకుతోట హరినాథ్ విన్నవించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దాదాపు మూడునెలలుగా తాగునీటి సమస్య ఉందని, అధికారులకు విన్నవించినా ఫలితంలేదని అన్నారు. జలజీవన్ మిషన్ నిధులతో ఇంటింటికి కొళాయిలు ఇవ్వాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు.

### యోగాపై శిక్షణ



ధర్మవరంలో యోగా చేస్తున్న విద్యార్థులు

ధర్మవరం, మే 26(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో సోమవారం ఉచిత శిక్షణ కార్యక్రమంలో భాగంగా యోగాతోపాటు తెలుగు, ఆంగ్లంపై మెలకువలపై గ్రంథాలయ అధికారిణి అంజలి సౌభ్యావతి శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయంలో చదువు, పోటీపరీక్షలు, వివిధ విభాగాలకు చెందిన అంశాలకు చెందిన పుస్తకాలు అందబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రమణానాయక్, సత్యనారాయణ, శివమ్మ, గంగాధర్ పాల్గొన్నారు.

### యోగాపై అవగాహన అవసరం

నల్లచెరువు (కదిరి), మే 26(ఆంధ్రజ్యోతి): యోగాపై ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త తెలిపారు. సోమవారం నల్లచెరువులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో యోగాపై అవగాహన కల్పించారు. శిక్షణ ఇచ్చారు. ఇందులో టీడీపీ యువత అధ్యక్షుడు గుప్త ప్రసాద్, నాయకులు బేకరీ నాగరాజు నాయుడు, సతీష్‌నాయుడు, దేవేంద్రగౌడ్, భరత్ పాల్గొన్నారు.

### ఫుట్‌పాత్ పనుల పరిశీలన

పుట్టపర్తిరూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని గోకులంలో నిర్మిస్తున్న ఫుట్‌పాత్ పనులను ఆర్డీఓ సువర్ణ సోమవారం పరిశీలించారు. ఫుట్‌పాత్ పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, కాంట్రాక్టర్లకు సూచించారు.



ఫుట్‌పాత్ పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ

# అందని వేతనాలు

### పారిశుధ్య కార్మికుల పాట్లు

అమడగూరు (కదిరి), మే26(ఆంధ్రజ్యోతి): మండలంలో పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులు 24 మంది ఉన్నారు. వీరిలో కొందరు మూడు నెలలు, మరి కొందరు రెండు నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. వీరికి నెలకు రూ.ఆరువేలు చొప్పున వేతనాలు అందాల్సి ఉంది. నెలల తరబడి జీతాలు ఇవ్వకపోతే తాము ఎలా కుటుంబాన్ని పోషించుకునేదని వారు వాపోతున్నారు. జీతాలు అందక పస్తులతో గడుపుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య కార్మికులు ఇక వేరే పనిచేయలేక.. ఊరి వదిలి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లలేక ఇబ్బందులు పతున్నారన్నారు. జీతాలు రాకున్నా.. రోజూ ఉదయం ఐదు గంటల నుంచే వీధుల్లో చెత్తను తొలగిస్తున్నామని, పాలకులు, అధికారులు స్పందించి.. తమకు సకాలంలో జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

● చెడిపోయిన రిక్షాలు

వీధుల్లో సేకరించిన చెత్తను తీసుకెళ్లడానికి గతంలో మూడు చక్రాల సైకిళ్ల (రిక్షాలు) ఇచ్చారు. అయితే వాటి చక్రాలు బెండ్ అయ్యాయని, టైర్లు కూడా దెబ్బతిన్నాయని, పంచర్లు అయ్యాయని పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు. దీంతో చెత్తను తీసుకెళ్లడం కూడా ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చెత్తను తొలగిస్తున్న పంచాయతీ కార్మికుడు

కొత్త రిక్షాలు మంజూరు చేయాలని.. లేక ఉన్న వాటికి కనీసం మరమ్మతులు అయితే చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

#### జీతాలు అందక పాట్లు

సకాలంలో జీతాలు ఇవ్వడం లేదు. మాకు రెండు నెలలుగా జీతాలు లేవు. ఇచ్చే రూ.ఆరు వేలతోనే నెలంతా సర్దుకుని జీవిస్తున్నారు. అవికూడా సకాలంలో అందకపోతే ఎలా జీవనం సాగించాలి.

-నాగప్ప, పారిశుధ్య కార్మికుడు, మహమ్మదాబాద్

#### సమస్య పరిష్కరిస్తాం

15వ ఆర్థిక సంఘం కింద జీతాలు నమోదు చేస్తే సకాలంలో జీతాలు అందుతున్నాయి. స్వచ్ఛభారత్ కింద నమోదు చేస్తే జీతాల పంపిణీలో జాప్యం జరుగుతోంది. కార్మికులకు ఏదో ఒక మార్గంలో సకాలంలో జీతాలు అందేలా చూస్తాం.

-మునియప్ప, ఎంపీడీఓ

## జీతాల కోసం పారిశుధ్య కార్మికుల ధర్నా



రోడ్డుపై బైఠాయించిన నాయకులు, కార్మికులు

ఓబుళదేవరచెరువు, మే 26(ఆంధ్రజ్యోతి): తమకు పెండింగ్ జీతాలు చెల్లించాలని మండలంలోని వివిధ సచివాలయాల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం కదిరి, రాయచోటి ప్రధాన రహదిరిపై సీఐటీయూ జిల్లా నాయకుడు సాంబశివ ఆధ్వర్యంలో రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. 20నెలలుగా పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించకుండా పనులు చేయించుకుంటున్నారన్నారు. దీంతో పారిశుధ్య కార్మికుల జీవనం దుర్భరంగా మారిందన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ వెంకటారామిరెడ్డి వారితో మాట్లాడి వెంటనే పెండింగ్ జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జీఎల్ నరసింహులు, ఇసాక్, బాబ్‌జాన్, రైతు సంఘం నాయకులు రాజారెడ్డి, ఖాదర్‌బాషా, పారిశుధ్య కార్మికులు ఆంజనేయులు, అక్కులప్ప, దొడ్డెప్ప, కదిరప్ప, నరసింహ పాల్గొన్నారు.

## జాతీయ రహదారి పనుల అడ్డగింత

ముదిగుబ్బ, మే26(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ నుంచి పుట్టపర్తికి చేపట్టిన జాతీయ రహదారి (342) పనులను భూ నిర్వాసితులు సోమవారం మండల కేంద్రంలో అడ్డుకున్నారు. రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం న్యాయమైన పరిహారం అందిస్తేనే పనులు చేయనిస్తామని, లేకపోతే భూములు ఇచ్చే పరిస్థితి లేదని ఆ రైతులు తేల్చిచెప్పారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, పరిహారం విషయంలో ఇంకా స్పష్టత రాలేదని అన్నారు. కార్యక్రమంలో భూనిర్వాసితులు రమేష్‌బాబు, సోమల ప్రకాష్, సనత్‌కుమార్ విశ్వనాథ్, ప్రభాకర్, హనుమంతు, అశోక్, రాగినాయుడు, ప్రసాద్, లక్ష్మీదేవి, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ రహదారి పనులను అడ్డుకున్న భూనిర్వాసితులు

## వంటావార్పుతో ప్లంబర్ల నిరసన

ధర్మవరం, మే 26(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలు పర్కిరించాలని తహసీల్దార్ కార్యాలయ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ, ప్లంబర్స్ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు సోమవారానికి ఆరో రోజుకు చేరుకున్నాయి. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు వంటావార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఇందులో ఏఐటీయూసీ కార్మికసంఘం నాయకులు ఎర్రంశెట్టి రమణ, సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, చేనేత కార్మికసంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, ప్లంబర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు గోవిందరాజులు, కార్యదర్శి అన్నం లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.



వంటావార్పు చేస్తున్న నాయకులు

## హెర్బల్‌పార్క్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ధర్మవరం, మే 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రత్యేక హెర్బల్ పార్క్ ఏర్పాటు కోసం అధికారులు స్థలాలను పరిశీలించారు. సోమవారం ఏపీ మెడిసినల్ అండ్ అరోమెటిక్ ప్లాంట్స్ బోర్డు సీఈఓ చంద్రశేఖర్, ఆర్డీఓ మహేశ్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ నటరాజ్, ఉద్యానవన శాఖ అధికారి అమరేశ్వరి, డిప్యూటి తహసీల్దార్ సురేశ్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు పట్టణంలోని గాంధీనగర్, రాంనగర్ ప్రాంతాల్లోని మున్సిపల్ స్థలాలను పరిశీలించారు.

### మహానాడుకు తరలిరండి

నల్లమాడ, మే 26(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో మంగళ, బుధ, గురువారల్లో నిర్వహించనున్న మహానాడు కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి.. విజయవంతం చేయాలని మండల కన్వీనర్ మైలే శివశంకర్ సోమవారం కోరారు. ఈ మహానాడుకు రాష్ట్ర ప్రముఖ నాయకులు హాజరవుతారన్నారు.

# అర్జీలను సకాలంలో పరిష్కరించండి: కలెక్టర్



పుట్టపర్తిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

పుట్టపర్తిటౌన్, మే26(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలించే అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి వాటిని పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జేసీ అభిషేక్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ 224 అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అలాగే రెవిన్యూ సదస్సులు, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన వినతులను త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రజలనుంచి వచ్చిన అర్జీలపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలన్నారు. జిల్లా శాఖల హెచ్‌ఓడీలు క్షేత్రస్థాయిలో పర్యటించి, సమస్యలు పరిష్కరించాలన్నారు.

● యోగా కార్యక్రమాలు..

రాష్ట్ర ప్రభుత్వం యోగాకు అధిక ప్రాధాన్యతనిస్తోందని, ఇందులో భాగంగా పర్యాటక కేంద్రాలు, ఆధ్యాత్మిక కేంద్రాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ అన్నారు. ఈనెల 28న పుట్టపర్తి, జూన్ 4న కదిరి, 6న ధర్మవరం, 13న హిందూపురం, 15న పెనుకొండలో యోగా దినోత్సవం నిర్వహిస్తామన్నారు. జూన్ 21న జిల్లా స్థాయిలో లేపాక్షిలో యోగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● ఎస్సీ కాలనీలోని వెళ్లకుండా కంచె

కొత్తచెరువు: మండలంలోని ఇరగంపల్లి గ్రామ సమీపంలోని ఎస్సీ కాలనీలోకి వెళ్లకుండా అదే గ్రామానికి చెందిన బోయ చిన్న వెంకటరాముడు రహదారికి అడ్డంగా 15 రోజుల క్రితం కంచె వేశాడు. ఈ సమస్యను పరిష్కరించాలని ఆ కాలనీ వాసులు అలివేళమ్మ, ఆనంద్, ఓబుశేశు, మారుతి, రామాంజినేయులు, అంజినప్ప, భగవంతప్ప సోమవారం తహసీల్దార్ నీలకంఠారెడ్డికి ఫిర్యాదు చేశారు.

● మాగుట్టలు సోలార్‌కు ఇవ్వద్దు

తనకల్లు : మండలంలోని మల్లిరెడ్డిపల్లి గ్రామం సర్వేనెంబర్ 63లోని రెవెన్యూ గుట్టలపై తాము తరాల నుంచి పశుపోషణ, గొర్రెల పెంపకం ద్వారా జీవనం సాగిస్తున్నామని, అలాగే అనేక మంది గిరిజనులు ఆ భూములు సాగుచేసుకుంటున్నారని, ఇటీవల ఆ గుట్టలను సోలార్ కంపెనీలకు అప్పగించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆ తండావాసులు వాపోతున్నారు. ఈ మేరకు ఆ గుట్టలను ప్రైవేటు సోలార్‌కు ఇవ్వరాదంటూ తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు సోమవారం వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ కలెక్టర్ నుంచి ఈ గుట్టలపై నివేదికలు పంపమని ఆదేశాలు అందాయని, మీరించిన ఫిర్యాదులను సైతం కలెక్టర్‌కు పంపుతామని చెప్పారు.

● ఆర్డీటీ సంస్థను కాపాడండి

నల్లచెరువు (కదిరి): నిరుపేదలకు సేవలందిస్తున్న ఆర్డీటీకి విదేశీ నిధులు అందుకుండా.. పోవడంతో ఆ సంస్థ సేవలు ఆగిపోయే ప్రమాదముందని, ఆ నిధులు అందేలా చర్యలు తీసుకోవాలని నల్లచెరువు మండలంలోని పలు గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రామప్పగారిపల్లి, నల్లచెరువు, ఉబిచెర్ల ఎస్సీకాలనీవాసులు పాల్గొన్నారు.

● నల్లమాడ: జిల్లాలో ఆర్డీటీ సేవలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు కుచ్చెపు చంద్ర డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి ఆర్డీటీ చాలా సేవలు చేస్తోందన్నారు.



కొత్తచెరువు: ఎస్సీకాలనీలోకి వెళ్లకుండా వేసిన కంచె



తనకల్లు: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

## క్రైం న్యూస్..

### రోడ్డుప్రమాదంలో కారు మెకానిక్ మృతి



నవీన్‌కుమార్(ఫైల్)

ధర్మవరం రూరల్, మే26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి వంక సమీపంలో సూర్య ఎస్టేట్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జ్యోతుల నవీన్‌కుమార్ (33) మరణించాడు. ఇతను ధర్మవరం పట్టణంలోని శాంతినగర్‌లో ఉంటూ కారుమెకానిక్‌గా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం అతను గొల్లపల్లి వంక సమీపంలో ఉన్న కుణుతూరు జగనన్న లేఅవుట్ సమీపంలో కారు రిపేరీ చేయడానికి వెళ్లాడు. కారు రిపేరీ చేసి తిరిగి పట్టణానికి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. సూర్య ఎస్టేట్ వద్దకు రాగానే మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి దారిపక్కనున్న రాళ్లల్లోకి దూసుకెళ్లాడు. దీంతో నవీన్ కుమార్ అక్కడికక్కడే మరణించాడు. రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి పరిశీలించారు. నవీన్‌కుమార్‌కు భార్య కీర్తన ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

### దంపతులకు గాయాలు

తనకల్లు, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటి క్రాస్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కదిరికి చెందిన దంపతులు ఖాదర్‌వలీ, జిలానీ గాయపడ్డారు. వీరు ద్విచక్రవాహనంలో మదనపల్లికి వెళ్తుండగా... కొక్కంటిక్రాస్ దాటిన తరువాత వాహనం అదుపు తప్పి, రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకున్నారు. ఈ ప్రమాదంలో జిలానీ కాళ్లు విరిగాయి. ఖాదర్‌వలీకి బలమైన గాయాలయ్యాయి. వీరిని వందేమాతరం అంబులెన్సులో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### వేధింపులపై కేసు నమోదు

ధర్మవరం, మే 26(ఆంధ్రజ్యోతి): తనను వేధిస్తున్నారని ఓ మహిళ ఫిర్యాదు చేయడంతో.. ఆమె భర్త, అత్త, మామలపై పోలీసులు కేసు నమోదు చేశారు. రామగిరి మండలం కుంటిమద్ది గ్రామానికి చెందిన ఉప్పర లక్ష్మీతేజ, ధర్మవరం పట్టణం కేతిరెడ్డికాలనీకి చెందిన రవీంద్రనాథ్‌లకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. రవీంద్రనాథ్ ఎక్స్‌ప్రెస్ కొరియర్ కంపెనీలో డెలివరీ మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వివాహమైనప్పటి నుంచి లక్ష్మీతేజని ఆమె భర్త, అత్తమామలు నిత్యం వేధిస్తున్నారు. అంతేకాకుండా రవీంద్రనాథ్‌కు మరో మహిళతో వివాహేతర సంబంధమూ ఉంది. దీంతో ఎక్కువ సమయంలో ఆ మహిళతోనే ఉంటున్నాడు. ఈ విషయాన్ని లక్ష్మీతేజ తన అత్తామామలకు చెప్పినా పట్టించుకోలేదు. అంతేకాకుండా తనకు విడాకులు ఇవ్వాలని రవీంద్రనాథ్ నిత్యం లక్ష్మీతేజతో గొడవపడేవాడు. దీనికి తోడు అత్తామామలూ వేధిస్తుండటంతో ఈ ముగ్గురిపై లక్ష్మీతేజ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో లక్ష్మీతేజ భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

### ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్ చోరీ



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

ఓబుళదేవరచెరువు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగేడుకుంట పంచాయతీ గొల్లవారిపల్లి సమీపంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రైతు చేతన్ ప్రకాష్ పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు. అందులోని కాపర్ వైర్, సామగ్రిని ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన చేతన్.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు, పేదలు

### పేదలకు పట్టాలివ్వాలి: సీపీఐ

పుట్టపర్తిటౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): తమకు ఇంటిపట్టాలు పంపిణీ చేయాలని తనకల్లు మండలం బొంతపల్లి గ్రామం సర్వేనెంబర్ 183ఏలో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూ.. 150 పేదకుటుంబాలు, కూలీలు నాలుగు సంవత్సరాల నుంచి ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుని నివాసముంటున్నారని, వారికి ఇంటిపట్టాలు మంజూరు చేయాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోలేదన్నారు. అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కదిరప్ప, పవన్, చౌడప్పయాదవ్, రెడ్డెప్ప, రవి, అంజనప్ప, సుగుణమ్మ, నిజామొద్దీన్ పాల్గొన్నారు.

### ఆక్రమణల తొలగింపు



దారి హద్దుల కొలతలు వేస్తున్న ఎంపీడీఓ

కదిరిఅర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ రహదారి నుంచి కౌలేపల్లి గ్రామంలోకి వెళ్లు రోడ్డు ఆక్రమణకు గురైంది. వెళ్లడానికి ఇబ్బందిగా ఉండడంతో గ్రామస్థులు ఎంపీడీఓ పొలప్పకు సోమవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంపీడీఓ గ్రామానికి వెళ్లి ఆక్రమణలకు గురైన దారి హద్దులను కొలతలు వేసి.. ఆక్రమణలను తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శైలజా, వీఆర్‌ఓ మోహన్, గ్రామ సర్వేయర్లు అంబ్రీన్, ఆదర్శకుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

### కోల్డ్ స్టోరేజీకి రహదారి ఏర్పాటు

తనకల్లు, మే 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని చౌడేశ్వరీ మండల సమాఖ్య ఆధ్వర్యంలో రైతుల కోసం కోల్డు సోర్ నిర్మాణం చేపట్టారు. ఈ స్టోరేజీకి రహదారి సౌకర్యం లేకపోవడంతో సోమవారం వీఓడీ అధ్యక్షురాలు తోట సరోజమ్మ ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రోడ్డు నిర్మిస్తే ... ఈ ప్రాంతంలోని రైతు సంఘాల్లో సభ్యులు తమ ఉత్పత్తులను కోల్డు స్టోరేజీలో నిలువ చేసుకునే అవకాశముందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం జయంతి, ఎఫ్‌పీఓ సీపీ బాబ్‌జాన్ పాల్గొన్నారు.



రహదారి పనులను పరిశీలిస్తున్న అధికారులు

# జనావాసాల్లోకి వన్యప్రాణులు

**అధికమైన చిరుతలు, ఎలుగుబంట్ల సంచారం**
**అటవీ, కొండ ప్రాంతాల్లో భయంభయంగా**
**గ్రామస్థులు, పశువుల కాపర్లు**
**అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకోలు**


కొండలో ఎలుగుబంట్లు (ఫైల్)


అగళి గాయత్రి కాలనీలో చిరుత (ఫైల్)

మడకశిర, మే26, (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో చిరుతలు మృత్యువాత పడుతుండడం, జనవాసాల్లో సంచరిస్తుండడంతో ఆ పరిసర ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అటవీ, కొండ ప్రాంతాల్లో ఆహారం దొరకక చిరుతలు, ఎలుగుబంట్లు పట్టణ, గ్రామాల సమీపంలోకి వస్తున్నాయి. శనివారం నియోజకవర్గం పరిధిలో అగళి మండలంలో గాయిత్రి కాలనీలో ఇళ్ల సమీపంలో చిరుత సంచరించడంతో కాలనీ వాసులు ఆందోళనకు గురయ్యారు. గతంలో అటవీ, కొండ ప్రాంతాల్లో ఎలుగుబంట్లు, చిరుతలు సంచరించేవని, ఈమధ్య కాలంలో జనవాసాల్లోకి వస్తున్నాయని దీంతో రాత్రి పూట బయటకు రావాలన్నా, పొలాల వద్దకు వెళ్లాలన్నా భయమేస్తోందని ఆ పరిసరాల వాసులు అంటున్నారు. మూడసంవత్సరాల కాలంలో నాలుగ చిరుతలు మృత్యువాత పడ్డాయి. రెండు రోజుల క్రితం రొళ్ల మండలం గుడ్డగుర్కి సమీపంలోని కొండలో చిరుత కళేబరాన్ని పశువుల కాపరులు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. రెండు రోజుల క్రితం మడకశిర పట్టణంలోని ప్రైవేటు స్కూల్‌లో రాత్రి సమయంలో ఎలుగుబంటి సంచరించింది. ఇలా వరుస సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్థులు, పొలాల వద్ద ఉన్న కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక సరిహదు ప్రాంతం అయిన మడకశిర నియోజకవర్గంలో 50శాతం పైబడి కొండలు గుట్టలకు ఆనుకుని గ్రామాలు, పొలాలు ఉన్నాయి. కర్ణాటకకు ఆనుకుని ఉండడంవల్ల ఆ ప్రాంతం నుంచి కూడా వణ్యప్రాణులు మడకశిర ప్రాంతంలోకి వస్తున్నాయని సంబంధిత శాఖ అధికారులు అంటున్నారు. గతంలో చిరుతలు అరుదుగా కనపడేవని, ప్రస్తుతం గ్రామాల సమీపంలోకి, పొలాల వద్దకు వస్తున్నట్లు గుర్తిస్తున్నామన్నారు. ఎక్కువగా ఎలుగుబంట్ల బెడద ఉండేదాని ఇటీవల కాలంలో చిరుతల సంచారం కూడా అధికమైందంటున్నారు. గతంలో గుడిబండ మండలం కేంద్రంలో ఇంటి నిర్మాణం జరుగుతుండగా నీటి కోసం తాగడానికి చిరుత రావడం, తోటలో సంచరించిన సందర్భాలు ఉన్నాయి. నియోజకవర్గంలోని రొళ్ల మండలం స్వారిగిరి కొండ, రత్నగిరి కొండ, బూతప్పకనుము, ఎస్‌ఎస్ గుండ్లు కొండలు, గుండుమల కొండ పరిసర ప్రాంతాల్లో చిరుతలు, ఎలుగుబంట్ల సంచారం ఎక్కువగా ఉంది. దీంతో ప్రజలు ఆ ప్రాంతాల్లో పోలాల వద్దకు వెళ్లాలన్నా భయభ్రాంతులకు గురవుతున్నారు. పశువులు, మేకలు, గొర్రెల కాపరులు ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు ఆయా ప్రాంతాల్లో తగిన చర్యలు తీసుకుని వన్యప్రాణులు జనావాసాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఉదుగూరు గ్రామ పొలిమేరలో చిరుత సంచారం


చిరుత తిని వదిలేసిన కళేబరాన్ని చూపుతున్న గ్రామస్థులు

అమరాపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉదుగూరు గ్రామ పొలిమేరలో చిరుతపులి సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ గ్రామం అడవికి దగ్గర ఉంది. ఆదివారం రాత్రి సిద్దేశ్వర ఎంజేరప్ప షెడ్ దగ్గర పొలం పనులు చేసుకుంటూ ఉన్నాడు. షెడ్డు వద్ద ఉన్న కుక్కలపై చిరుత దాడిచేసి కుక్కను ఈడ్చుకెళ్లి తిని కళేబరాన్ని వదిలి వెళ్లిందని గ్రామస్థులు తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుతను బంధించి అటవీప్రాంతంలో వదిలేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## మహానాడును జయప్రదం చేయండి

**టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండమల తిప్పేస్వామి**

మడకశిర రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): మహానాడుకు పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండమల తిప్పేస్వామి, మహాసభ అబ్జర్వర్ శివప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నాయకులు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, రాజు, భక్తర్, గిరి, కోట్లరగంగేగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### గోరంట్లలో అల్పాహారం

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): మహానాడుకు వెళ్లేవారికోసం గోరంట్లలో గురువారం ఉదయం అల్పాహారం ఏర్పాటు చేశారు. మంత్రి సవిత ఆదేశం మేరకు మండల కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి ఆధ్వర్యంలో సోమవారం చర్యలు చేపట్టారు. ఈనెల 29న పెనుకొండ నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి బస్సుల్లో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో బయలుదేరి గోరంట్ల మీదుగా మహానాడుకు వెళ్లనున్నారు. వారికికోసం గురువారం ఉదయం గోరంట్లలో పెద్ద ఎత్తున అల్పాహారం ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం కదిరి ప్రధాన రహదారిలో జీనవాండ్లపల్లి, మారెమ్మ ఆలయం వద్ద అనువైన స్థలంకోసం టీడీపీ నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాసులు, బాబులురెడ్డి, నిమ్మల శ్రీధర్, బెల్లాలచెరువు చంద్ర, ఉత్తమరెడ్డి, మహేంద్ర, నరేష్ పాల్గొన్నారు.


అల్పాహారం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్(ఆంధ్రజ్యోతి): మహానాడుకు పెద్దఎత్తున తరలిరావాలని టీడీపీ కన్వీనర్‌లు శ్రీరాములు, ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. పెనుకొండ నియోజకవర్గం నుంచి వంద బస్సులు, కార్లు ఏర్పాటు చేశామని వచ్చే వారందరికీ భోజన, మంచినీటి వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేశవయ్య, నారాయణస్వామి, శ్రీనివాసులు, రఘు, గోపాల్, బాబుల్‌రెడ్డి, సమీ, రామలింగ పాల్గొన్నారు.

అగళి(ఆంధ్రజ్యోతి): మహానాడుకు పార్టీ అభిమానులు, కార్యకర్తలు తరలిరావాలని జడ్పీటీసీ ఉమేష్, మండల కన్వీనర్ కుమారస్వామి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## మండల కన్వీనర్‌గా వెంకటేశులు



సోమందేపల్లి, మే26(ఆంధ్రజ్యోతి): మండల టీటీపీ నూతన కన్వీనర్‌గా వెంకటేశులు ఎన్నికయ్యారు. ఇటీవల నియోజకవర్గ కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఐదు మండలాలకు నూతన కన్వీనర్లను ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో సోమందేపల్లి మండల కన్వీనర్‌గా వెంకటేశులును ఎన్నుకున్నా అధికారికంగా ప్రకటించలేదు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశం అనంతరం ఆయన్ను కన్వీనర్‌గా మంత్రి సవిత ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కన్వీనర్‌గా ఎన్నుకున్న పార్టీ వర్గాలకు, మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. పార్టీకోసం కష్టపడి పనిచేస్తానన్నారు. మహానాడును పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నీరుగంటి చంద్ర, సిద్దలింగప్ప, సీసీహరి, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### 'యోగాతో సంపూర్ణ ఆరోగ్యం'

సోమందేపల్లి, మే 26(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని విద్యాశాఖాధికారి అంజనేయులు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. యోగా, ప్రాణాయామం ద్వారా మానసిక, శారీరక రుగ్మతలు దూరమై ప్రశాంతత చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### అహల్యాబాయి హోల్కర్‌కు ఘననివాళి

పరిగి, మే 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీరలింగేశ్వర ఆలయంలో పరిగి వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో అహల్యాబాయి హోల్కర్ 300 జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహల్యాబాయి హోల్కర్ శివభక్తురాలని, మాళ్వా ప్రాంతంలోనేకాక భారతదేశమంతటా శివాలయాలను నిర్మించారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మూర్తి, హిందూపురం బీజేపీ మండల కన్వీనర్ ఉదయ్, పరిగి మండల కన్వీనర్ మూర్తి, కార్తీక్, శివ తదితరులు పాల్గొన్నారు.

### అక్కమ్మగార్ల ఆలయంలో ప్రత్యేక పూజలు

గుడిబండ, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌ఎస్‌గుండ్లు గ్రామంలో వెలసిన ఏడుమంది అక్కమ్మగార్ల ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం అమ్మవార్లకు ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

### డబ్బు వసూలు చేసే వారిపై చర్యలు తీసుకోండి

హిందూపురం, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు టీసీలు ఇవ్వడానికి డబ్బు వసూలుచేసే హెచ్‌ఎంలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా ప్రధాన కార్యదర్శి బాబావలి, ఎమ్మార్వో కార్యాలయంలో ఎంఈఓ గంగప్పకు వినతిపత్రం అందించారు.

## బలవంతపు భూసేకరణ ఆపాలంటూ నిరసన



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

హిందూపురం, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బలవంతపు భూసేకరణ ఆపాలని చలివెందుల రాచపల్లి రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా చిన్నకారురైతుల భూములను లాక్కుంటోందని దీనివల్ల బజారు నపడాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం పునరాలోచించాలన్నారు.

### వీరజవాన్‌కు స్వర నీరాజనం

పరిగి, మే 26(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన జవాన్ మురళినాయక్‌కు సోమవారం ఎస్పీ బాలు స్వరనీరాజన కళాబృందం నివాళులు అర్పించారు. సేవామందిరంలోని లింగణ్ణ బీఈడీ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేటీ శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణత్యాగం చేయడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ చాంద్‌బాష, బాలు, కళాబృందం అధ్యక్షుడు రామలింగప్ప, పాల్గొన్నారు.

### మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం

హిందూపురం, మే26(ఆంధ్రజ్యోతి): హిందూపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మణేసముద్రానికి చెందిన అశ్వత్థరెడ్డి, వైస్ చైర్మన్‌గా బాలచంద్రనాయక్, సభ్యులుగా అగ్గి శ్రీనివాసులు, చెన్నారెడ్డి, సుకన్య, నరసింహులు, జయంతి, మాలక్క, వెంకటలక్ష్మి, ఆరిఫా, సరస్వతి, రాధమ్మ, మహేష్, మధుసూదనయ్య, రాజకమలమూర్తితోపాటు కిరికెర సహకార సంఘం అధ్యక్షుడు అగ్రికల్చర్ ఏడీ, హిందూపురం మున్సిపల్ చైర్మన్, మార్కెట్ అధికారితో ఉత్తర్వులు జారీచేశారు.

### తల్లిదండ్రులకు యువతి అప్పగింత

రొళ్ల, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంంలోని యువతి అదృశ్యమైనట్లు ఈనెల మొదటివారంలో తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువతి విజయవాడలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు సోమవారం స్థానిక తహసీల్దార్ షెక్షావలి సమక్షంలో తల్లిదండ్రులకు యువతిని అప్పగించారు.

### తప్పిపోయిన బాలుడు అమ్మమ్మ ఇంట్లో ప్రత్యక్షం

హిందూపుం, మే 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్‌కాలనీలో నివాసమున్న రామచంద్రరాజు కుమారుడు పార్థసారథిరాజు (11) తప్పిపోయినట్లు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం ఆడుకోవడానికి ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. తిరిగి రాలేదు. ఆచూకీ లేకపోవడంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే బాలుడు గాలివీడులోని అమ్మమ్మవారి ఇంట్లో ఉన్నట్లు తండ్రి పోలీసులకు తెలిపారు.

**న్యూస్ బాక్స్**

## తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం


తాగునీటి పైప్‌లైన్ పనులు చేపడుతున్న అధికారులు

పెనుకొండ రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా తీవ్ర తాగునీటి సమస్య ఎదుర్కొంటున్న ప్రజలకు బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత చొరవతో తాగునీటి పరిష్కారం లభించింది. పెనుకొండ మండలం కోనాపురం గ్రామంలో తాగునీటి సమస్యను తీర్చడానికి రూ.6.5లక్షలు మంత్రి మంజూరు చేయగా, నగర పంచాయతీ అధికారులు సోమవారం పైప్‌లైన్ పనులు ప్రారంభించారు. దీంతో తాగునీటి సమస్య తీరనుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

### తాగునీటి సమస్య పరిష్కారం

మడకశిర రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): ఎల్లోటీలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. గ్రామంలో తీవ్ర తాగునీటి సమస్యతో గ్రామస్థులు ఇబ్బందులు పడేవారు. సమస్యను గ్రామస్థులు ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో స్థానిక సర్పంచు గంగమ్మ, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి నాగరాజు సోమవారం గ్రామంలో తాగునీటి బోరు వేయించారు. నీరు పుష్కలంగా పడ్డాయి. దీంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తంచేశారు.

### అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేద్దాం

పావగడ, మే 26(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తన జీవితంలో అనుభవించిన కష్టాలను భావితరాలు భవిష్యత్తులో అనుభవించరాదని చేపట్టిన సంకల్పమే నేడు భవిష్యత్తులో మనం అందరిలాగా జీవించడానికి ఆస్కారం అయిందని తుంకూరు జిల్లా అట్రాసిటీ కమిటీ సభ్యుడు నారాయణప్ప అన్నారు. పట్టణంలోని ఆదర్శనగర్‌లో నిర్వహించిన అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మధు, సుబ్బరాజు పాల్గొన్నారు.

### ఐటీ పార్కుకు భూములు ఇవ్వం

**కొండూరు రైతులు**


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

లేపాక్షి, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఐటీ పార్కు పేరుతో ఇతర అభివృద్ధి పథకాల పేరుతో తమ భూములు లాక్కుంటే చూస్తూ ఊరుకోమని కొండూరు రైతులు వెల్లడించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా తమ కుటుంబాలు వ్యవసాయంపైనే ఆధారపడ్డాయని తమ పూర్వీకుల నుంచి వచ్చిన భూమిని నమ్ముకుని పాడిపరిశ్రమ, పండ్లతోటలు, మల్బరీతో సాగుచేసి తమ కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. అభివృద్ధి పేరుతో తమ భూములు సర్వేచేసి ఎంతో కొంత నగదు అప్పుజెప్పి తమ భూములను లాక్కుంటే తమ కుటుంబాలు వీధిన పడతాయన్నారు. ఎన్నిలక్షలు వెచ్చించినా భూమిని అప్పుజెప్పే ప్రసక్తేలేదన్నారు. ప్రభుత్వ భూములు పరిశీలించి అభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. వీరికి మద్దతుగా సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

### రహదారి ఆక్రమణపై ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు, గ్రామస్థులు

గోరంట్ల, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడిగేపల్లి పంచాయతీలోని గొల్లపల్లిలో రహదారి ఆక్రమణపై వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, కొండా వెంకటేశ్ తహసీల్దార్ మారుతికి సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పూర్వనుంచి గ్రామస్థులు, రైతులు పొలాల్లోకి వెళ్లే బండిరస్తాను చంద్రశేఖర్ అక్రమించుకుని కంచె వేశారన్నారు. గతంలో సర్వే చేయించి, హద్దులు చూపించినా, ప్రయోజనంలేకపోయిందన్నారు. ఉపాధి పథకం ద్వారా రోడ్డు వేయడానికి నిధులు మంజూరైనా, పనులు జగరకుండా అడ్డుపడుతున్నారన్నారు. రస్తా సమస్యను పరిష్కరించాలని ఫిర్యాదు దినోత్సవంలో తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు నాగభూషణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

### 'ఆధార్‌తో అనుసంధానం చేసుకోండి'

హిందూపురం, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నగదు బదిలీ కోసం ఖాతాదారులు ఆధార్‌తో బ్యాంక్ ఖాతాలను అనుసంధానం చేసుకోవాలని పురం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేసే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవలాంటి పథకాలకు నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాకు జమచేయడానికి ఎన్‌పిసిఐ విధానం కింద ఆధార్ అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో సుమారు 51లక్షల మంది ఖాతాలో సీడింగ్‌లేని కారణంగా తమశాఖ ఆధ్వర్యంలో గత యేడాది స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారన్నారు. తపాలాశాఖ, సచివాలయ సిబ్బంది, రాష్ట్ర ప్రభుత్వం అధికారుల సమన్వయంతో జూన్5లోగా ఆధార్ సీడింగ్‌తోపాటు ఎన్‌పిసిఐ లింకేజ్‌తో ఖాతాలను తెరవడంతోపాటు ఖాతాలేని వారికి నూతన పోస్టల్ బ్యాంకింగ్ ఖాతాలు తెరవనున్నట్లు తెలిపారు.

### వైసీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడిగా బాలాజీ

పెనుకొండ, మే 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ లీగల్‌సెల్ మండల అధ్యక్షుడిగా న్యాయవాది బాలాజీ ఎంపికయ్యారు. సోమవారం స్థానిక న్యాయవాదుల సంఘం సమావేశ భవనంలో సంఘం అధ్యక్షుడు వాల్మీకి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కొత్తగా ఎంపికైన లీగల్‌సెల్ అధ్యక్షుడు బాలాజీని న్యాయవాదుల సంఘం తరుపున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

### కాశీవిశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పెనుకొండ, మే 26 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అమావాస్యను పురస్కరించుకుని స్వామివారికి అర్చకులు రాఘవేంద్ర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహించి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు.

### వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక


పార్టీలోకి చేరిన వారితో నాయకులు

మడకశిర రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆమిదాల గొంది ఏఆర్ రొప్పం గ్రామానికి చెందిన 60 కుంటుబాలు వైసీపీని వీడి సోమవారం తెలుగుదేశం పార్టీలోకి చేరాయి. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండమల తిప్పేస్వామి, మహానాడు అబ్జర్వర్ శివప్రసాద్ టీడీపీ కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి పార్టీలోకి చేరినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు, ఉమాశంకర్, రాజు, భక్తర్ పాల్గొన్నారు.

### 'సబ్ రిజిస్ట్రార్‌ను బదిలీ చేయండి'


మాజీ మంత్రికి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

పావగడ, మే 26(ఆంధ్రజ్యోతి): కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారిని కాళ్లరిగేలా తిప్పిస్తున్న సబ్‌రిజిస్ట్రార్ రాధమ్మను బదిలీ చేయాలని రైతు సంఘం నాయకులు మాజీ మంత్రి వెంకటరమణప్పను సోమవారం కోరారు. ఆమెపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం మాజీ మంత్రిని ఆయన నివాసంలో కలిసి ఈ మేరకు విన్నవించారు. బ్రోకర్లను నియమించి ముడుపులు ఇచ్చిన వారికే పనులు జరుగుతున్నాయన్నారు. పేద ప్రజలు, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. స్పందించి ఆమెను బదిలీ చేయాలని, లేనిపక్షంలో రిజిస్ట్రార్ కార్యాలయం ముందు ఆమరణ నిరాహారదీక్ష చేపడతామని రైతు సంఘం నాయకులు తెలిపారు.

### యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభం

పెనుకొండ టౌన్, మే 26(ఆంధ్రజ్యోత): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రీజినల్ మేనేజర్ జితేంద్రకుమార్ మిశ్ర సూచించారు. సోమవారం పట్టణంలోని ట్యాంకు సర్కిల్‌లో నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన సేవలు అందించడానికి అన్ని రకాల సౌకర్యాలతో నూతన బ్రాంచ్‌ను ఏర్పాటు చేశామన్నారు. అతితక్కువ వడ్డీకే అర్హులకు రుణాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, సరోజ్‌ఠాగూర్, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

### మొరాయించిన సర్వర్

పెనుకొండ టౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించే సర్వర్ మొరాయించింది. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలుశాఖాధికారులు జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించేందుకు ఏర్పాటుచేసిన సర్వర్ మొరాయించడంతో మిన్నకుండిపోయారు. చేసేదిలేక కొద్దిసేపు చూసి ఎవరికి వారు తిరుగు ప్రయాణమయ్యారు.



### పురంలో చిరుజల్లులు

హిందూపురం, మే26(ఆంధ్రజ్యోతి): హిందూపురం ప్రాంతంలో సోమవారం దట్టమైన మేఘాలు కమ్ముకున్నాయి. దీంతో తేలికపాటి జల్లులు కురిశాయి. చల్లని గాలులు చిరుజల్లులతో పట్టణవాసులు ఉపశమనం పొందారు.

### సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ

పావగడ, మే 26(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో రైతులు సాగుచేసేందుకు విత్తన వేరుశనగను ఎమ్మెల్యే వెంకటేశ్, వ్యవసాయశాఖ అధికారి అజయ్‌కుమార్, రైతు సంఘం నాయకులు సోమవారం పంపిణీ చేశారు. లింగదహళ్లి, వైఎన్ హొసకోట, నాగలమడక, కసభ, మంగళవాడ, కేంద్రాలలో విత్తన వేరుశనగను రైతులు సబ్సిడీ ధరలో పొందవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. కదిరి, లేపాక్షి రకం వేరుశనగ జనరల్ రైతులు రూ.2880, ఎస్సీ, ఎస్టీలు రూ.2610, అదేవిధంగా టీఎంవి-2 రకం వేరుశనగ జనరల్ రైతులకు రూ.2130, ఎస్సీ ఎస్టీలకు రూ.1920సబ్సిడీతో 30కేజీల ప్యాకెట్ పొందవచ్చని పేర్కొన్నారు.

### కంచిసముద్రంలో చోరీ

పెనుకొండ రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): కంచిసముద్రంలో ఆదివారం ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు చాకలి మురళి తెలిపిన వివరాల మేరకు వ్యవసాయ పొలంలో మొక్కజొన్న పంటకు కాపలాగా వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు తాళాలు పగలకొట్టి బీరువాలో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. రొద్దం ఏఎస్‌ఐ కాంతప్పను వివరణ కోరగా చోరీ జరిగినట్లు సమాచారం అందగా సంఘటనా స్థలాన్ని పరిశీలించామని, బాధితుడు ఫిర్యాదు చేయలేదన్నారు.

### 'ఎమ్మెల్యేను విమర్శించే స్థాయా నీది..?'

అగళి, మే 26(ఆంధ్రజ్యోతి): మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజును విమర్శించే స్థాయి వైసీపీ సమన్వయకర్త ఈరలక్కప్పకు లేదని మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు బూతరాజు, ఎంపీటీసీ నాగోజీ, మాజీ సర్పంచ్ లింగన్న, నాగప్ప అన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనే కృతనిశ్చయంతో ఉన్న ఎమ్మెల్యేను విమర్శించేస్థాయి మీకుందా అని వారు ప్రశ్నించారు.

అమరాపురం(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎంఎస్‌రాజుపై వైసీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప చేసిన వ్యాఖ్యలను ఎస్సీసెల్ అధ్యక్షుడు జయకుమార్ ఖండించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న ఘనత ఎంఎస్‌రాజుకే దక్కుతుందన్నారు.